

ప్రభుత్వం వద్దన్నా.. ఏడు గంటలే కరెంటు

- అధికారుల అత్యుత్సాహం..
- మంత్రి గొట్టిపాటి ఆగ్రహాన్ని పట్టించుకోని వైనం
- రైతులతో చెలగాటం
- కరెంటు లేక ఎండుముఖం పట్టిన పంటలు

ఈ రైతు పేరు.. మంచూరి వెంకటేసు.. చిన్న మండెం మండలం దేవగుడిపల్లె కురవపల్లెకు చెందిన ఇతను మూడు ఎకరాలలో టమోటా.. అలసంద సాగు చేశాడు. వారం రోజుల ముందు వరకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేదు. అయితే ఐదారు రోజులుగా కరెంటు సరఫరా వేళల్లో మార్పులు చేయడంతో అగచాట్లు పడుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటల వరకు కరెంటు రాలేదు. దీంతో మోటారు వదలడానికి స్టార్టర్ బాక్సు వద్ద పడిగాపులు కాస్తున్నట్లు చెప్పాడు. పొద్దున్నే ఏమీ తినకుండానే.. కాపలా కాస్తున్నట్లు చెప్పాడు ఏడు గంటలు నిరంతరాయంగా కరెంటు ఇస్తే.. బోర్లలో ఉన్న కొన్ని నీళ్లు కొట్టేస్తే.. తర్వాత కరెంటు ఉన్నా.. ఉపయోగం లేదని వాపోయాడు. రాష్ట్ర ప్రభుత్వం 9 గంటల కరెంటు సరఫరా చేయాలని కోరుతున్నాడు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ విధాంగానే సరఫరా చేస్తోంది. అయితే రాయలసీమ జిల్లాల్లో గత సోమవారం నుంచి 9 గంటలకు బదులుగా 7 గంటలు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి మూడు రోజుల కిందట సీమ జిల్లాల్లో ఏడు గంటలే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. అంతకు మునుపు ఈ విషమయై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి మార్పులు ఉండవని పేర్కొంటూ ఈ ఉత్తర్వులిచ్చిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో సీఎండీ సైతం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి మార్పులు ఉండవని. ఈ వివాదాస్పద ఉత్తర్వుల్చిన అధికారిని బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. అయినా ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో రోజుకు 7 గంటలే వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీనిపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రెండు గంటలు విద్యుత్ సరఫరాలో కోత విధించడంతో ఇప్పటికే సాగులో ఉన్న పంటలు నీళ్లు అందక ఎండిపోతున్నాయి. మరోవైపు నిరంతరం ఏడు గంటలు ఇస్తుండడంతో చాలీచాలని నీళ్లున్న బోర్లలో నీళ్లు రాక.. పంటలు ఎండిపోతున్నాయి. దీంతో గత ఐదారు రోజులుగా జిల్లాలో రైతులు కరెంటు ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో? అని మోటార్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

అధికారుల అత్యుత్సాహం..

ఈనెల 3న ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం (ఆపరేషన్స్) పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం.. రాయలసీమలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ సరఫరాను 9 గంటల నుంచి 7 గంటలకు కుదించారు. అదీ ఏడు గంటలు నిరంతరాయంగా సరఫరా చేయాలని తెలిపారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 1,34,336 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వుల వల్ల వీళ్లందరిపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో ప్రతిరోజూ తెల్లవారుజాము 5 నుంచి ఉదయం 10 గంటల వరకు కరెంటు సరఫరా ఉండేది. తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు సరఫరా ఉండేది. ఈ విధానం రైతులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. అయితే ప్రస్తుతం ఉన్న ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఏ-గ్రూపులోని ప్రాంతాలకు ఉదయం 8.15 నుంచి సాయంత్రం 3.15 వరకు, బి-గ్రూపులోని ప్రాంతాలకు ఉదయం 11 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా అవుతోంది. దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కరెంటు సక్రమంగా రావడం లేదు..



గత వారం వరకు కరెంటు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. గత సోమవారం నుంచి కరెంటు సక్రమంగా రావడం లేదు. ఎప్పుడొస్తుందో..? ఎప్పుడు పోతుందో.? కూడా తెలియడం లేదు. రెండుచోట్ల పొలం పెట్టాను. ఒకచోట ఎకరా అలసంద సాగులో ఉంది. మరోచోట ఆరెకరాలు వేరుశనగ సాగులో ఉంది. పాలంగడ్డ ఫీడర్‌లైన్ ఉదయం 8.30కు వస్తుంది. 2.30కి పోతుంది. గతంలో ఉదయం ఐదు గంటల నుంచి పది వరకు.. మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు ఉండేది. గత సోమవారం నుంచి కరెంటు సక్రమంగా రాక.. పంటలకు తడులు కట్టడానికి కరెంటు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం వేరుశనగ చివరి దశలో ఉంది. కరెంటు సక్రమంగా రాక పోతే.. పంట ఎండిపోక తప్పదు.

- వెంకటరమణ, అడవి కమ్మపల్లె, సంబేపల్లె



వేరుశనగ పొలంలో పైపులు వేస్తున్న దృశ్యం

మైనారిటీలకు ఉచిత విద్య

- విద్య, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక ప్రణాళికలు
- మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్



పీలేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీలకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోందని మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ తెలిపారు. పీలేరులో శనివారం జరిగిన జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల రాష్ట్రంలోని అధిక శాతం మైనారిటీలు తమ పిల్లల్ని 7వ తరగతి తరువాత చదివించలేకపోతున్నట్లు తేలిందన్నారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక ఇబ్బందుల వల్ల మైనారిటీలు మంచి విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ఉచిత విద్యను అందించేందుకు కసరత్తు చేస్తున్నారన్నారు. ఈ అంశంపై రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ గత కొంత కాలంగా కసరత్తు చేస్తున్నారని, త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం ఉందన్నారు. ముస్లిం మైనారిటీల కోసం దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా 12 రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఉర్దూ విద్య నేతి బీరకాయలో నేతి చందంగా మారిపోయిందన్నారు. పీలేరు వాసుల చిరకాల వాంఛ అయిన ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో మాట్లాడి మంజూరు చేయిస్తామన్నారు. ప్రస్తుతం ఉర్దూ ఉన్నత పాఠశాలకు రూ.25 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి కూడా అనుమతులు, నిధులు మంజూరు చేయిస్తానని ప్రకటించారు. అనంతరం ఆయన దివంగత మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జమీలా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్, నాయకులు వజ్రాల ఇమ్ముదుల్లా, మల్లెల రెడ్డి బాషా, లడ్డూ జాఫర్, నల్లారి రియాజ్, షౌకత్ అలీ, కోటపల్లె బాబురెడ్డి, హనీఫ్, షరీఫ్, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, యల్లెల రెడ్డప్పరెడ్డి, అతార్ చాను, రహంతుల్లా, తహసీల్దారు భీమేశ్వరరావు, ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి

- కోర్టు అదనపు భవనాలు ప్రారంభించిన సుప్రీంకోర్టు జడ్జి
- జన్మభూమికి జస్టిస్ భట్టి గర్వకారణం : హైకోర్టు సీజే



నూతన భవనాలను ప్రారంభించి శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, హైకోర్టు సీజే ఠాకూర్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో అందుబాటులోకి వచ్చిన విజ్ఞానాన్ని యువ న్యాయాధికారులు, న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని, గూగుల్‌ను కాకుండా గురువులను అనుసరించాలని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి అన్నారు. శనివారం మదనపల్లె కోర్టు భవనాల సముదాయాల్లో నూతనంగా నిర్మించిన కోర్టు అదనపు భవనాలను రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలసి సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు గౌరవవందనం సమర్పించారు. బార్ అసోసియేషన్ నాయకులు న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించాక న్యాయమూర్తులు నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ భట్టి మాట్లాడుతూ ఒకప్పుడు సౌకర్యాలు లేని సమయంలో యువ న్యాయాధికారులు, న్యాయవాదులు గురువులను ఆదర్శంగా తీసుకుని కోర్టులో వారి వాదనలు వినిపించారని, న్యాయాధికారులు ఇరుపక్షాల వాదనలు విని తీర్పు ఇచ్చేవారన్నారు. నేడు ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిందన్నారు. కొందరు న్యాయవాదులు గూగుల్‌ను అనుసరిస్తున్నారే కాని, కోర్టులో గురువులను అనుసరించకపోవడంతో ఎదగలేకపోతున్నారన్నారు. మదనపల్లె స్వస్థలమైన తన ప్రయాణంలో విద్యాబోధనలు అందించిన జీఆర్‌టీ హైస్కూల్, బీటీ కళాశాల గుర్తించి జస్టిస్ భట్టి కీర్తించారు. బెంగళూరులో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన అనంతరం తన తండ్రి న్యాయవాది సరస రామకృష్ణప్ప, సోదరుడు న్యాయవాది సరస సుబ్రమణ్యం సూచనలతో మూడేళ్ల పాటు మదనపల్లె కోర్టులో పనిచేశానని గుర్తుచేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లడం అక్కడి నుంచి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తన ప్రయాణంలో అప్పట్లోనే హైకోర్టు చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన జస్టిస్ దివాన్, యోగేశ్వర దయాళ్‌లను ఆదర్శంగా తీసుకుని ఈ స్థాయికి వచ్చానన్నారు. దివంగత సీనియర్ న్యాయవాదులు పులి రామకృష్ణారెడ్డి, జి.సుబ్రమణ్యం వాదనలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టుకు జడ్జిని అందించిన మదనపల్లె కోర్టులో అదనపు భవనాలను ప్రారంభానికి రావడం ఆనందంగా వుందన్నారు. ఈ భవనాలను చక్కగా నిర్వహించడంతో పాటు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర హైకోర్టులో 2024 సంవత్సరంలో 2,300పైగా కేసులు పరిష్కారం అయ్యాయని, అదేవిధంగా కింది కోర్టులు కూడా కృషి చేయాలన్నారు. అనంతరం హైకోర్టు పోర్టుపోలియో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ టీసీడీ శేఖర్, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి



ప్రార్థనా సమయంలో గౌరవంగా లేచి నిలబడ్డ న్యాయమూర్తులు

ద్వారకనాథరెడ్డి, చిత్తూరు జిల్లా జడ్జి భీమరావు ప్రసంగించారు. కార్యక్రమంలో మదనపల్లె సెకండ్ ఏడీజీ అబ్రహాం, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఏఎస్పీ వెంకటాద్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎస్ఎస్ఎన్ ప్రసాద్, రాజేంద్ర, అమరనాథరెడ్డి, శివరామిరెడ్డి, చైతన్య, బార్ అసోసియేషన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌కు చేరుకున్న హైకోర్టు సీజే

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు విచ్చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, న్యాయమూర్తులు శేఖర్, క్రిష్ణమోహన్‌లు శుక్రవారం రాత్రి హిల్స్‌లో విడిది చేసి శనివారం మదనపల్లె, పలమనేరులలో నిర్మించిన కోర్టు సముదాయ భవనాల ప్రారంభోత్సవాలకు వెళ్లారు. అనంతరం తిరిగి శనివారం సాయంత్రం హార్సిలీహిల్స్‌కు వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, న్యాయమూర్తి క్రిష్ణమోహన్‌లకు అధికారులు ఘనస్వాగతం పలికారు.

అక్షరం అండకు స్పందన

- ఏవీ నాయుడు కాలనీలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా..పరిష్కారమే అజెండా'లో ప్రజలు ప్రస్తావించిన సమస్యకు మున్సిపల్ అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా మదనపల్లె ప ట్టణం ప్రశాంత్‌నగర్ 30వ వార్డులో జనవరి 28వ తేదీ జరిగిన కార్యక్రమంలో ఏవీ నాయుడు కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద, ట్యాంకు ఆవరణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాలువలు శుభ్రం చేయాలని స్థానికులు సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా శనివారం పారిశుధ్య కార్మికుల చేత గ్యాంగ్‌వర్క్ చేయించారు. ఇందులో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, మేస్త్రీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు 20 మంది శానిటరీ కార్మికులతో పని పూర్తి చే యించారు. ఎ.వి.నాయుడు కాలనీలోని మున్సి పల్ స్థలాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయించారు. ఓవర్‌హెడ్ ట్యాం కు ఆవరణలో వ్యర్థాలు, పైపు లు, రాళ్లను తొలగించి చదును చేశారు. అలాగే మురికినీటి కాలువలను శుభ్రం చేయడంతో పాటు కాలువ వెంబడి ఉన్న చెత్త, పచ్చికను తొలగించి బ్లీచింగ్ చేయించారు. దీంతో అక్కడ మహిళా సంఘాలు సమావేశం ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళ పిల్లలు ఆడుకోవడానికి, స్థానికులు, వృద్ధులు వాకింగ్ చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

పెద్దకర్మకు వెళుతూ.. తిరిగిరాని లోకాలకు..

- ములకలచెరువు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఐచర్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి





మృతి చెందిన సిద్దేశ్వరి, రెడ్డిశేఖర్

ములకలచెరువు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిన్నాన్న పెద్దకర్మకు వెళుతూ ముగ్గురు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. ద్విచక్ర వాహనంలో భార్య, కూతురు, కొడుకుతో వెళుతున్న వారిని ఐచర్ వాహన రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబ పెద్దతో పాటు ఇద్దరు చిన్నారులు మృత్యువాతపడగా చిన్నారుల తల్లి మృత్యువుతో పోరాడుతోంది. వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు శనివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కుమ్మరపల్లెకు చెందిన మద్దిలేటి సోమశేఖర్ కుటుంబం మదనపల్లెలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఈయనకు భార్య కవిత, కుమారుడు రెడ్డిశేఖర్ (5), కుమార్తె సిద్దేశ్వరి (3) ఉన్నారు. సోమశేఖర్ మదనపల్లెలో భవన నిర్మాణ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గాండ్లపెంట మండలం తూపల్లెలో ఉన్న సోమశేఖర్ చిన్నాన్న వేమనారాయణ ఇటీవల చనిపోవడంతో పెద్దకర్మ ఉందని బంధువులు ఫోన్‌లో చెప్పారు. శనివారం సోమశేఖర్ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంలో కదిరికి బయలుదేరాడు. మార్గంమ ధ్యంలోని ములకలచెరువు షాదీమహాల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం సడన్‌గా పక్కకు తిప్పి కొంత రోడ్డులో మేర నిలిచిపోయింది. ఐచర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డుకు అడ్డుగా రావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఐచర్‌ను ఢీకొంది. ప్రమాదంలో సోమశేఖర్ (32) తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందా డు. అతడి భార్య కవిత, పిల్లలు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరి తీవ్రంగా గాయపడడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



సంఘటనా స్థలంలో మృతి చెందిన సోమశేఖర్

అందుబాటులో లేని 108

ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చిన్నారి సిద్దేశ్వరిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. ములకలచెరువు 108 వాహనం ఇతర కేసుకు వెళ్లడంతో పెద్దతిప్పసముద్రం 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనం వచ్చేందుకు కొంత సమయం పడుతుండడం, చిన్నారిని మదనపల్లెకు తీసుకెళ్లాల్సిన కుటుంబీకులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో చిన్నారి పరిస్థితిని చూసి చలించిన పాత్రికేయుడు విజయ్‌కుమార్, స్థానికులు రమణ, వెంకటరమణ, వెంకీ, శంషాద్‌లు ఓ కారులో హుటాహుటిన చిన్నారితో పాటు తీవ్రంగా గాయపడ్డ ఐదేళ్ల బాలుడు రెడ్డిశేఖర్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పాపను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించగా అక్కడ మృతి చెందాడు.

ముగ్గురు చనిపోయినా.. చూడలేని స్థితిలో కవిత

రోడ్డు ప్రమాదంలో భర్త, పిల్లలు మృతి చెందినా వారిని చూడలేని స్థితిలో కవిత ఉండడం అందరి మనస్సు కలచివేస్తోంది. కవిత కూడా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు విరిగిపోవడంతో కళ్లు తెరవలేని స్థితిలో ఉంది. ఆమె పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. ఇక్కడి నుంచి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించిన కవితను పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు ఆమెను తిరుపతి రుయాకు తరలించారు. నిరుపేద కుటుంబంలో ఒకేరోజు ముగ్గురు మృతి చెందడంతో బంధువులు, గ్రామస్థుల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

మంటగలిసిన మానవత్వం..

మానవత్వం మంటగలిసింది. ప్రమాదం జరిగిన సంఘటనా స్థలంలోనే సోమశేఖర్ మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు ఆధారాల కోసం సెల్‌ఫోన్‌తోనైనా సమాచారం తెలుసుకుందామని వెతికారు. సంఘటనా స్థలం మొత్తం జల్లెడ పట్టినా సెల్‌ఫోన్ కనపడలేదు. సెల్‌ఫోన్ ఎవరో ఎత్తుకెళ్లారని గ్రహించిన పోలీసులు సోమశేఖర్ భార్య దగ్గరైనా సెల్‌ఫోన్ ఉండేమోనని చూశారు. ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్ కీ ప్యాడ్ సెల్ డిస్‌ప్లే పగిలిపోవడంతో సమాచారం కనుగొనేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. పగిలిపోయిన డిస్‌ప్లేతో నెంబర్లు కనబడక ఫోన్ చేసేందుకు వీలుకాక పోవడంతో పోలీసులు వివరాలు తెలుసుకోలేకపోయారు. ప్రమాదం జరిగిన రెండు గంటల తరువాత ఆమె సెల్‌కు బంధువులు ఫోన్ చేయడంతో ప్రమాద విషయాన్ని తెలియజేసి వివరాలు కనుగొన్నారు. ప్రమాదం స్థలం నుంచి పోలీసులకు సమాచారం అందించడం, బాధితులకు ఆస్పత్రికి తరలించేందుకు సహకరించాల్సింది పోయి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లడంతో మానవత్వం మంటగలిసినట్లు కన్పించింది.

ఐచర్ వాహన డ్రైవర్ పరార్.. కేసు నమోదు

ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సంఘటన జరిగిన వెంటనే పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశయం ఘనం... అమలు అస్తవ్యస్తం



పీలేరు పట్టణం కట్టుకాలువ వీధిలోని ఆర్వో వాటర్ ప్లాంటు



కలకడ వారపు సంతలో మూతపడ్డ ఆర్వో ప్లాంటు

- త్రిశంకు స్వర్గంలో ఆర్వో వాటర్ ప్లాంట్లు
- జీతాల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచితంగా సురక్షిత తాగునీరు అందిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీలేరు నియోజకవర్గంలో ఇబ్బడి ముబ్బడిగా ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులతో కొన్ని, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో మరికొన్ని, గ్రామ పంచాయతీ నిధులతో ఇంకొన్ని నిర్మించారు. 2021 నుంచి 2024 వరకు ఆదాయం ఉండే మేజర్ పంచాయతీల దగ్గర నుంచి నామమాత్రం ఆదాయం లేని పంచాయతీల్లోనూ వీటిని నిర్మించారు. నిర్మించిన మూడేళ్ల వరకు ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులతో వాటిని నిర్వహించారు. ఆ సమయంలో ఆయా ప్లాంట్ల మొత్తం నిర్వహణతో పాటు ఆపరేటర్ల జీతభత్యాలు కూడా ఇచ్చేవారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో ఆ బాధ్యతల నుంచి ఏపీఎండీసీ తప్పుకుంది. అప్పటి నుంచి వాటి నిర్వహణ బాధ్యత, ఆపరేటర్ల జీతభత్యాలు ఆయా పంచాయతీల మీద పడింది. ప్లాంట్ల నిర్వహణతో పాటు ఆపరేటర్ల జీతభత్యాలు ఏ పద్దు కింద చెల్లించాలో తెలియక చాలా పంచాయతీల్లోని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అలా పీలేరు పట్టణంలో ప్రస్తుతం నడుస్తున్న 25 ప్లాంట్ల ఆపరేటర్లు నాలుగు నెలలుగా తమకు జీతాలు లేవని వాపోతుండగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తాము చెల్లించలేమంటూ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వాటర్ ప్లాంట్ల ఏర్పాటును తమ ప్రచార అస్త్రంగా మలుచుకున్న వైసీపీ నాయకులు వాటి నిర్వహణ, ఆపరేటర్ల జీతాలు వంటి అంశాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో ఈ సమస్య నెలకొందని, ఆదాయం లేని చోట్ల నీళ్లను నామమాత్రపు ధరకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు పెదవి విరుస్తున్నారు.

వైసీపీ ప్రచార అస్త్రంగా ఆర్వో వాటర్ ప్లాంట్లు

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్య ఆహార అలవాట్లలో భాగంగా గడిచిన దశాబ్ద కాలంగా ఆర్వో నీటి వినియోగం పెరిగింది. చిన్న చిన్న ఊళ్లలో సైతం ప్రైవేటు వ్యక్తులు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అంటూ క్యాన్ నీళ్లను విక్రయించేవారు. ఇదే అంశాన్ని 2019లో వైసీపీ తమ ప్రచార అస్త్రంగా మలుచుకుంది. ప్రజలకు సురక్షిత తాగునీరు అందివ్వడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని, తాము అధికారంలోకి వస్తే ఊరూరా ఉచితంగా ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని పీలేరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్లమెంటు నియోజకవర్గ ప్రాంత అభివృద్ధి నిధులతో పీలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. కరోనా సమయంలో ఎంపీల నిధులకు అడ్డుకట్ట పడడంతో ఇచ్చిన హామీని నెరవేర్చుకునే క్రమంలో మేజర్ పంచాయతీల్లో పంచాయతీ నిధులతో వాటిని నిర్మించారు. చిన్న చిన్న గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నం కావడంతో ఏపీఎండీసీ సామాజిక బాధ్యత నిధులతో కొన్నింటిని నిర్మించారు. స్థానిక నాయకుల నుంచి డిమాండ్లు అధికం కావడంతో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అధిక శాతం ప్రాంతాల్లో ప్లాంట్లను ఇబ్బడిముబ్బడిగా నిర్మించారు. నిర్మాణ సమయంలో ఆయా ప్లాంట్ల నిర్వహణను మూడేళ్ల పాటు ఏపీఎండీసీ ద్వారా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్లాంట్ల నెలవారీ నిర్వహణ తోపాటు వాటిల్లో పనిచేసే ఆపరేటర్లకు ప్రతి నెలా రూ.6200 జీతం, రూ.1300 పీఎఫ్ చెల్లించేవారు. ఆ క్రమంలో పీలేరు మండలంలోని పీలేరు పట్టణంలో దశల వారీగా 25 ప్లాంట్లు, వేపులబైలు, బోడుమల్లువారిపల్లె, బాలంవారిపల్లె పంచాయతీల్లో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఏపీఎండీసీ నిర్వహణ ఉన్నన్నాళ్లూ నీటిని ఉచితంగా అందజేశారు. 2024 మే మాసంలో ఆ బాధ్యతల నుంచి ఏపీఎండీసీ తప్పుకోవడంతో సమస్య ప్రారంభమైంది.

జీతాల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు


2024 మే వరకు సాఫీగా జీతాలు అందుకున్న ఆపరేటర్లు ఆ తరువాత నెల నుంచి జీతం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పీలేరు పట్టణంలోని 25 ఆపరేటర్లు తమ జీతాల కోసం పంచాయతీ అధికారుల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడం, పీలేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరగడం, నిధులు దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలి అప్పటి ఈవో, సర్పంచ్ చెక్ పవర్ రద్దు కావడంతో వీరి కష్టాలు అధికమయ్యాయి. ఆయా ప్లాంట్లలో వైసీపీ సానుభూతిపరులనే ఆపరేటర్లుగా అప్పట్లో నాయకులు నియమించడంతో చాలామంది ప్రభుత్వం మారడంతో ఆ పని వదిలేసుకున్నారు. అలాంటి చోట్ల స్థానిక టీడీపీ నేతలు, పంచాయతీ అధికారులు కొత్త వారిని నియమించి ప్లాంట్లను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆపరేటర్ల జీతాలతో పాటు ప్లాంట్ల నిర్వహణ పంచాయతీ అధికారులకు కత్తి మీద సాములా మారింది. వాటర్ ప్లాంట్ల నిర్వహణ పంచాయతీ విధుల్లో లేకపోవడంతో ఆపరేటర్లకు ఏ పద్దు కింద జీతాలు చెల్లించాలో తెలియక వారు తలలు పట్టుకుంటున్నారు. తమకు జీతాలు లేవని పలువురు ఆపరేటర్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని ఆశ్రయించడంతో ఆయన గత ఏడాది అక్టోబరులో అందరికీ నెలకు రూ.6 వేలు చొప్పున మూడు నెలల జీతం ఇప్పించారు. అప్పటి నుంచి నేటి వరకు ఆపరేటర్లు జీతాల కోసం ఎదురుచూస్తూ పనిచేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల్లో కొన్ని చోట్ల పంచాయతీల ఆధ్వర్యంలో ప్లాంట్లు నడుస్తున్నప్పటికీ వాటి నిర్వహణ కోసం ప్రజల నుంచి క్యాన్ నీటికి రూ.2 నుంచి రూ.5 దాకా వసూలు చేస్తున్నారు. ఆ డబ్బులతో ఆపరేటర్ల జీతం, ప్లాంట్ల నిర్వహణ చేస్తున్నారు.

డీపీవో దృష్టికి జీతాల సమస్య


ఆర్వో ప్లాంట్ల ఆపరేటర్ల జీతాల అంశాన్ని పీలేరు పంచాయతీ ఈవో గురుమోహన్ గురువారం జిల్లా ఇన్‌చార్జ్ డీపీవో మస్తాన్‌వలీ దృష్టికి తీసుకెళ్లారు. జీతాల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకోవాలని, అనుమతులు వచ్చిన తరువాతనే వారిని జీతాలు చెల్లించగలమని ఆయన స్పష్టం చేశారు. అదే విషయాన్ని ఈవో గురుమోహన్ ఆపరేటర్లకు తెలియజేశారు. తాము ఇది వరకే జిల్లా పంచాయతీ అధికారికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిర్ణయం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్వో ప్లాంట్లు ఎక్కడెక్కడ-ఎన్నెన్ని

పీలేరు మండలంలోని పీలేరు పట్టణంలో మొత్తం 25 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రస్తుతం నాలుగు ప్లాంట్లు సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా మూతపడగా 21 పనిచేస్తున్నాయి. కలికిరి మండలంలోని కలికిరి పంచాయతీలో ఆరు, గుట్టపాళెంలో నాలుగు, రంగనాథపురంలో ఒకటి, మహల్, కొటాల, మేడికుర్తి పంచాయతీల్లో ఒక్కొక్క ఆర్వో వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో నిధుల కొరత కారణంగా గుట్టపాళెంలోని మూడు ప్లాంట్లు పనిచేయడం లేదు. మహల్‌లోనూ పంచాయతీ నిర్వహించడం లేదు. మిగిలిన చోట్ల నడుస్తున్నాయి. గుర్రంకొండ పట్టణంలో మూడు ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మరో ప్లాంటు ప్రారంభమే కాలేదు. కలకడలో ఏర్పాటు చేసిన రెండు ప్లాంట్లూ ప్రస్తుతం పనిచేయడం లేదు. మరమ్మతుల కారణంగా అవి మూతపడ్డాయి. వాల్మీకిపురం మండలంలో మొత్తం 10 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని గాంధీపేట, గండబోయినపల్లెలోని ప్లాంట్లు ప్రస్తుతం మూతపడ్డాయి.



పీలేరు మండలం మేకలవానిపల్లె గ్రామంలో మూతపడిన ఆర్వో ప్లాంటు



వాల్మీకిపురం మండలం గండబోయినపల్లెలో మూతపడ్డ ఆర్వో ప్లాంటు

క్వారీ సూపర్‌వైజర్ ఆత్మహత్య

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫ్యానుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం బి.కొత్తకోట మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీ ముత్యాలరెడ్డిపల్లె వద్దనున్న ముత్యాలగడ్డ సమీపంలో క్వారీలో ప్రకాశం జిల్లా ఆలూరుకు చెందిన ఆవుల అభిలాష్ (32) ఆరేళ్ల నుంచి సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే ఓ రూంలో ఉంటూ కంకర పనులను పర్యవేక్షించేవాడు. అతడి తండ్రి శ్రీనివాసులు ఇటీవల మృతి చెందాడు. తండ్రిని అమితంగా అభిమానించే అభిలాష్ డిప్రెషన్‌కు లోనయ్యాడు. తీవ్ర మనస్థాపంతో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఏఎస్ఐ బొజ్జేనాయక్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం గ్రామ శివారులోని భాకరాపేట-సిద్దవటం మార్గంలో గ్రామానికి చెందిన రైతు చలపాటి రామసుబ్బయ్య (60) శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళుతుండగా బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు విచారణ చేస్తున్నారు. కారులో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం జూకుంట గ్రామానికి చెందిన కొండలరావు, గీత, కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది

పాఠశాల బస్సు, కారు ఢీ

చిన్నమండెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప- బెంగళూరు రహదారిలోని వండాడి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు, కారు ఢీకొన్నాయి. రాయచోటి నుంచి చిన్నమండెం వైపు విద్యార్థులను తీసుకొస్తున్న బస్సు బెంగళూరు నుంచి రాయచోటి వైపు వస్తున్న కారును ఢీకొంది. ఆ సమయంలో స్కూల్ బస్సులో దాదాపు 50 మందికి పైగా విద్యార్థులున్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.20 లక్షల గోల్‌మాల్?

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పెద్ద స్కాం జరిగిందన్న వార్త శనివారం హల్‌చల్ చేసింది. కస్టమర్లు కుదువపెట్టిన బంగారాన్ని ఆ ఫైనాన్స్ సిబ్బంది తారుమారు చేసి సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ బంగారు కుదువపెట్టిన వారు డబ్బు తెచ్చి తమ బంగారం ఇవ్వమని అడుగుతున్న వారికి సర్వర్ పనిచేయలేదు... నాలుగు రోజులు ఆగి రండి అని చెబుతున్నారని కొందరు, తాము పెట్టిన బంగారంలో కొన్ని వస్తువులు లేవు అంటున్నారని మరికొందరు చెప్పుకొచ్చారు. విషయం దావానలంలా పట్టణం అంతా వ్యాపించడంతో ఆ ప్రైవేట్ ఫైనాన్స్‌లో బంగారం కుదువ పెట్టిన కస్టమర్లు ఒక్కొక్కరుగా బ్రాంచి వద్దకు చేరుకున్నారు. తమ బంగారం ఇవ్వమని కొందరు, ఏమైందని మరికొందరు సిబ్బందిని నిలదీశారు. కాగా ఈ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బంది రూ.లక్షల డబ్బును తమ సొంత అవసరాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వాడేశారని, కంపెనీ ఆడిట్‌లో ఈ విషయం బయటపడినట్లు తెలుస్తోంది. కస్టమర్లు తమ బంగారు నగలు విడిపించుకోవడానికి వచ్చి నగదు చెల్లించినపుడు ఆ నగదును చేతికి తీసుకొని, ఆన్‌లైన్‌లో యాజమాన్యానికి జమ చేయకుండా డూప్లికేట్ రిసిప్ట్‌లు ఇచ్చి, ఆ మొత్తాన్ని వీరు పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఆడిట్‌లో బయటపడటంతో ఆ సిబ్బందిపై చర్యలకు కంపెనీ పూనుకుంది. వీరిపై ఫిర్యాదు చేస్తారా? నగదును రికవరీ చేసి ఊరుకుంటారా అనేది తేలాల్సి ఉంది. బంగారు నగలపై ఎక్కువ రుణం ఇస్తారని వచ్చినందుకు తమకు ఎసరు పెట్టకుండా న్యాయం చేయాలని కస్టమర్లు కోరుతున్నారు.

క్రికెటర్ శివకోటికి ఏఎస్పీ సన్మానం



శివకోటిని సత్కరిస్తున్న ఏఎస్పీ

నందలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బోర్డ్ ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లో నిర్వహించనున్న టీ20, వన్డే సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన నందలూరు మండలవాసి ఏల్చూరి శివకోటిని ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సత్కరించారు. ఆయన క్రీడా జీవితం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో ముందుంటానని ఏఎస్పీ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో అంగన్వాడీ కార్యకర్త మృతి



కవిత (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్త మృతిపై దేవపట్ల పంచాయతీ ఆవులవాండ్లపల్లెవాసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు శనివారం మధ్యాహ్నం అంగన్వాడీ కార్యకర్త రెడ్డిమల్ల కవిత (43) కేంద్రంలోనే ఉరి వేసుకుని మృతి చెందింది. భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లిన ఆయా తిరిగి వచ్చే సరికి ఆమె ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించి, స్థానికులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆమెను రాయచోటి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ భక్తవత్సలం ఆసుపత్రికి చేరుకొని మృతికి కారణాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న ఎమ్మెల్యే

- విడిపించుకు వెళ్లిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు





మట్టి తరలిస్తున్న టిప్పర్, డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం మిల్లు వద్ద సిద్ధం చేస్తున్న లేఅవుట్‌కు అనుమతి లేకుండా మట్టితోలుతున్న టిప్పర్లను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అడ్డుకోగా, దీంతో ఆగ్రహించిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మట్టి టిప్పర్లను విడిపించుకు వెళ్లిన ఘటనతో మదనపల్లె రాజకీయ వేడి 'ఎమ్మెల్యే వర్సెస్ చినబాబు' అన్న రీతిన రాజుకుంది. రెండు నెలలుగా మదనపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నేతలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు వర్గాలుగా విడిపోయి, ఒక వర్గంపై మరొక వర్గం పరస్పరం విమర్శలు చేసుకోవడం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన ఈ వర్గాల మధ్య మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది. వివరాల్లోకి వెళితే...

మదనపల్లె మండలం సీటీఎం మిల్లు కొనుగోలు చేసిన వ్యక్తులు అక్కడ మిల్లు భవనాలను తొలగించి ఖాళీ అయిన 32 ఎకరాల భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం లేఅవుట్ సిద్ధం చేస్తున్నారు. ఈ లేఅవుట్‌ను చదును చేసేందుకు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నారు. ఈ క్రమంలో సీటీఎం గ్రామంలో ఓ లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎదుటకు మట్టి టిప్పర్లు వచ్చాయి. దీంతో వాటిని ఆపించిన ఎమ్మెల్యే మట్టి తోలేందుకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. అనుమతి లేకుండా అక్రమంగా మట్టితోలుతున్న వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడికి చేరుకున్న వీఆర్‌వోలు మునస్వామినాయక్, కళ్యాణి టిప్పర్ డ్రైవర్ నుంచి తాళాలు తీసిపెట్టుకుని, మట్టితో వున్న టిప్పర్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్లను అడ్డుకున్నది ఎవరంటూ ఆగ్రహించారు.

అంతేకాకుండా వీఆర్‌వో మునస్వామి, కళ్యాణిలను పిలిపించి వారి దగ్గర ఉన్న టిప్పర్ తాళాలను తీసుకుని టిప్పర్‌ను అక్కడి నుంచి పంపించి వేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మట్టి రవాణాకు అనుమతి దొరకలేదని, సోమవారం నిబంధనలు అనుసరించి మైనింగ్ ఏడీ నుంచి మట్టి రవాణాకు అనుమతి తీసుకుంటారని చినబాబు తెలిపారు. కాగా ఈ దృశ్యాలను అటు ఎమ్మెల్యే వర్గీయులు, ఇటు చినబాబు వర్గీయులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మదనపల్లె టీడీపీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు, శనివారం ఇద్దరు నేతలు వీధిలోకి రావడంతో ఒక్కసారిగా మంటలు రాజుకున్నట్లు అయ్యిందని ప్రజలు వాపోతున్నారు.

బెంగళూరు టు హార్సిలీహిల్స్

ఉల్లాసంగా..ఉత్సాహంగా యువత సైక్లింగ్



బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీహిల్స్‌కు శనివారం ఓ యువతీ, యువకుల బృందం సైకిళ్లపై వచ్చింది. బెంగళూరులోని పలు సైక్లింగ్ క్లబ్‌లు అప్పుడప్పుడూ ఇలాంటి ఈవెంట్లను నిర్వహిస్తుంటాయి. శనివారం ఉదయం 6 గంటలకు 60 మందితో కూడిన ఓ బృందం బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి హార్సిలీహిల్స్‌కు బయలుదేరింది. హొస్కోట, చింతామణి, తాడిగోళ్ల క్రాస్, గౌనిపల్లె, బి.కొత్తకోట మీదుగా హార్సిలీహిల్స్‌కు మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకున్నా రు. సైకిళ్లకు అమర్చిన జీపీఎస్ చిప్ ద్వారా వా రి కదలికలను ఆర్గనైజర్లు అబ్జర్వేషన్‌లో పెట్టా రు. ఈ సందర్భంగా సైక్లింగ్ చేస్తూ వచ్చిన యువకులు మాట్లాడుతూ ఈ సైక్లింగ్‌తో మానసిక ఉల్లాసం, శరీరదారుఢ్యం పెంపొందుతుందన్నారు.

'పోక్సో' కేసులో పోలీసుల నిర్లక్ష్యం

- నిందితుడిని అరెస్టు చేయలేదు
- బాధితురాలి తల్లి ఆవేదన

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల పల్లవోలు పంచాయతీలోని ఓ గ్రామంలో 'పోక్సో' చట్టం కింద నమోదైన కేసులో కలికిరి పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలి తల్లి వాపోయింది. కేసు పురోగతిపై శనివారం ఆమె పీలేరులో విలేఖరులతో మాట్లాడింది. గడి గ్రామానికి చెందిన వైసీపీ నేత జుబేర్ అహ్మద్ కుమారుడు జునైద్ అహ్మద్ గత నెల 23వ తేదీ రాత్రి తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. అదేరోజు తాము ఫిర్యాదు చేసినా కలికిరి పోలీసులు పట్టించుకోలేదన్నారు. చివరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి జోక్యంతో జనవరి 25న జునైద్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడిని అరెస్టు చేయడంలో గానీ, నిందితుడు వినియోగించిన వాహనాన్ని గానీ సీజ్ చేయలేదన్నారు. తాము ఆ సంగతి గురించి పలుమార్లు కోరినా కలికిరి సీఐ రెడ్డిశేఖరరెడ్డి దాటవేత ధోరణిలో సమాధానాలు చెబుతున్నారన్నారు. ఈలోపు నిందితుల బంధువులైన పల్లవోలు పంచాయతీ సర్పంచ్ బీబీ ఆయిషా భర్త ఇస్తియాక్ అహ్మద్, నిందితుడి సమీప బంధువు అయిన మునీర్ తమ ఇంటికే వచ్చి బెదిరించారన్నారు. నిందితుడిని అరెస్టు చేయకుండా తాము పోలీసులకు రూ.5 లక్షలు లంచం ఇచ్చామని, మీకు కూడా రూ.7 లక్షలు పరిహారం చెల్లిస్తామని, ఆ డబ్బు తీసుకుని రాజీకి పోవాలని బెదిరించారన్నారు. రాజీకి అంగీకరించకపోతే లారీలతో గుద్ది తనను, తన భర్తను చంపేస్తామని బెదిరించారన్నారు. వారు బెదిరించిన విషయాన్ని పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడు కలికిరి, గడి పరిసరాల్లోనే స్వేచ్ఛగా తిరుగుతున్నాడని తాము పలుమార్లు పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదన్నారు. కేసును రాయచోటి డీఎస్పీ విచారిస్తున్నారని, ఆయన వచ్చి విచారణ చేసేంత వరకు తాము ఏమీ చేయలేమని ఆయన చెప్పారని వాపోయింది. ఇదే విషయాన్ని తాము ఇటీవల సంబేపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఆయనకు వినతిపత్రం అందజేశామని, అప్పటి నుంచి తమకు బెదిరింపులు ఎక్కువైపోయాయన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు. తమ కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన జునైద్ అహ్మద్, తమను బెదిరించిన మునీర్, ఇస్తియాక్ అహ్మద్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని శనివారం పీలేరులో మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మేకల చెరువు కబ్జా

- భూమిని చదును చేసి.. ఫెన్సింగ్ ఏర్పాటు
- ఇరిగేషన్‌శాఖ అధికారులు ఎక్కడ ?

మేకల చెరువు అన్యాక్రాంతం చేసి వెంచర్ వేసిన దృశ్యం



సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి పంచాయతీ పరిధిలోని మేకలచెరువును ఆక్రమించి చదును చేసి ఫెన్సింగ్ వేశారు. పునాదులు తీశారు. పశువులకు, వన్య ప్రాణులకు తాగునీటి వనరుగా ఉన్న చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నా, కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సాయికృష్ణ మాట్లాడుతూ మేకల చెరువు అన్యాక్రాంతం అంశాన్ని తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా సర్వే చేయిస్తామని, అన్యాక్రాంతమై ఉంటే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలియజేశారు.

ప్రాణం తీసిన సరదా

నీటిలో మునిగి ఇద్దరు నేపాలి యువకులు మృతి
మృతులు హోటల్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు



డ్యాం వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ, ఫైర్ సిబ్బంది



బినయ్ మృతదేహం - ఫైల్ ఫొటో



బీరేంద్ర మృతదేహం - ఫైల్ ఫొటో

వల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈదలేడేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వెళ్లిన ఇద్దరు నేపాలి యువకులు బినయ్(22), బీరేంద్ర (30) నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకెళితే...

నేపాలీ యువకులు బినయ్, బీరేంద్ర చెన్నూరులో శివరాం ధమ్ బిర్యానీ హోటల్‌లో పనిచేస్తున్నారు. శనివారం హోటల్‌కు సెలవు దినం కావడంతో అక్కడ పనిచేసే సిబ్బంది సరదాగా ఈదలాడేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్టవద్దకు వచ్చారు. ఈ క్రమంలో వారిలో ఇద్దరు గల్లంతయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో సీఐ రోషన్ హుటాహుటిన డ్యాం వద్దకు చేరుకుని ఫైర్ సిబ్బందిని, స్థానిక జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి ఇద్దరు యువకులు మృతదేహాలు బయటికి తీశారు. కాగా మృతుల గురించి ఆరా తీస్తే బతుకుదెరువు కోసం నేపాల్ నుంచి వచ్చి శివరాం ధమ్ బిర్యానీ హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరికి వివాహమైనట్లు తెలిపారు. సీఐ పూర్తి వివరాలు సేకరించి శవాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. డ్యాం వద్దకు వచ్చే పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోతాయని ఆయన హెచ్చరించారు.

గండి ఘాట్‌లో ఇరుక్కుపోయిన లారీ, ఆర్టీసీ బస్సు



లారీ, బస్సు ఇరుక్కుపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

చక్రాయపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానం సమీప ఘాట్‌రోడ్డులో శనివారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా రావడంతో ఇరుక్కుపోయాయి. రెండు కొండల నడుమ రోడ్డు చాలా ఇరుకుగా ఉండడంతో రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోయాయి. దీంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఇరుకైన ప్రదేశం కావడంతో ఏమాత్రం అజాగ్రత్త పడ్డ పాపాఘ్నిలో పడిపోవాల్సిందే. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదపు అంచులో ఇరుక్కుపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు కొంచెం ఓపిక పట్టి ఉంటే వాహనాలు ఇరుక్కుని ఉండేవే కాదన్నారు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ హస్తం ?



స్వాధీనం చేసుకున్న వాహనం, చౌక బియ్యం బస్తాలు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చౌక బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ చోటా నేతల హస్తం కొనసాగుతోంది. అధికారం కోల్పోయినా ఇంకా వారి హవా నడుస్తోంది. తాజాగా పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో స్వాధీనం చేసుకున్న 70 బస్తాల చౌక బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ చోటా నేతల ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో రేషన్ షాపు వద్ద బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున దాడి చేశారు. ఈ ఘటనలో బొలెరో వాహనం సహా 70 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ షాపు నుంచి బియ్యం తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బొలెరో వాహనంతో, బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. సంఘటనపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన మహబూబ్‌బాష, మాబాషను పవర్ హౌస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. నజీరు, పటోడితో కలిసి బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నారని విచారణలో వెల్లడైందన్నారు.

ఓటమి గెలుపునకు నాంది

సాఫ్ట్‌బాల్‌లో కమలాపురం విద్యార్థులు విన్నర్స్



విజేతలుగా నిలిచిన కమలాపురం క్రీడాకారులు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని, గెలుపోటములు సమానంగా స్వీకరించాలని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక డిగ్రీకళాశాలలో జరుగుతున్న అంతర్ కళాశాల క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే క్రీడారంగంలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వినోద్‌కుమార్, కోఆర్డినేటరు వినయ్‌కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పల్లాక్రిష్ణ, పీడీ అద్భుత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలెఫ్‌లో 'ఒంటిచెయ్యి'కి చోటు

వేంపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా అలెఫ్ బుక్ కంపెనీ తీసుకొచ్చిన భారతదేశ వంద కథల పుస్తకంలో వేంపల్లె షరీఫ్ రచించిన 'ఒంటిచెయ్యి' కథను ప్రచురితం చేశారు. కేరళకు చెందిన ప్రఖ్యాత కవి, కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఇండియన్ లిటరేట్ పత్రిక పూర్వ సంపాదకుడు ఏజె థామస్ ఉత్తమ కథల సంకలనం సంపాదకుడుగా వ్యవహరించారు. తెలుగు కథలు చలం, కవన శర్మ, సయ్యద్ సలీం, ప్రసిద్ధ భారతీయ రచయితలు రవీంద్రనాథ్‌ఠాగూర్, ప్రేమ్‌చంద్, శరత్‌చంద్ర చటర్జీ తదితరులు రచించిన కథలున్న ఈ పుస్తకంలో తన కథను ప్రచురించడం సంతోషంగా ఉందన్నారు. రాయలసీమలాంటి కథలకు ఆ పుస్తకంలో స్థానం లభించడం మరచిపోలేని జ్ఞాపకమని ఆయన అభిప్రాయపడ్డారు.

దైన్యం... చివరి మజిలీ మార్గం

అంతిమ కష్టాలు తీరేదెన్నడో ? ● కనీస సదుపాయాలకు నోచుకోని శ్మశాన వాటికలు
అంత్యక్రియలు చేసేందుకు వెళ్లాలన్నా అంతే... ● కర్మకాండలు ఇక ప్రశ్నార్థకమే....



చిట్టడివిని తలపిస్తున్న 29వ వార్డు శ్మశాన వాటిక

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇది చిట్టడవి కాదు... చివరి మజిలీ(శ్మశానం).... అవును జీవితానికి చివరి మజిలీ చేరాలంటే ఎన్నో కష్టనష్టాలు అనుభవిస్తే తప్ప మార్గం సుగమం కాదనేది నగ్న సత్యం. ఇక్కడ చివరి మజిలీలో కనీసం మౌలిక సదుపాయాలు సైతం కరవయ్యాయని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకెళ్లాలన్నా తీరు తెన్నూ లేక ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. దేహం విడిచిన ఆత్మకు శాంతి చేకూరాలంటే మృతదేహానికి శాస్త్రోక్తంగా ఉత్తర క్రియలు చేయాలి. అయితే మృతదేహాన్ని శ్మశానికి తీసుకెళ్లాలన్నా కుటుంబ, బంధు, మిత్రులు సైతం ఎన్నో కష్టాలను అనుభవించాల్సి ఉంటోంది. తర్వాత మూడో రోజు, ద్వాదశ కర్మలకు సైతం వెళ్లాల్సి వస్తోంది. ఇన్ని ఇక్కట్లను అనుభవించలేని కుటుంబ, బంధు, మిత్రులు నామమాత్రంగా కొద్ది మంది మాత్రమే వెళ్లి తంతు ముగించుకుని వస్తుంటారు. ఫలితంగా ఆత్మకు సరైతన శాంతి లభించదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఈ విషయాలను అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదంటే అతిశయోక్తి కాదు. ఇదీ పట్టణంలోని 29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశానవాటిక దీన స్థితి. వివరాల్లోకెళితే....

మున్సిపాలిటీ పరిధిలో 36వార్డుల్లో సుమారు 90 వేల పైచిలుకు జనాభా నివసిస్తుండగా మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం 12శ్మశాన వాటికలున్నాయి. వాటి అభివృద్ధి కోసం ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. కుమ్మరకొట్టాల వెనుకవైపు ఉన్న హిందూ శ్మశాన వాటికకు అంతిమ కష్టాలు తీరడంలేదు. ఏళ్ల తరబడి హిందూ శ్మశానవాటికలు ఎలాంటి అభివృద్ధికి నోచు కోలేదు. పేరుకే 12 శ్మశానవాటికలున్నా వాటి అభివృద్ధి కోసం ఎటువంటి నిధులూ మంజూరు కాకపోవడంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. కొన్నిచోట్ల శ్మశాన వాటికలు కంపచెట్లతో నిండుకుని ఉండగా, మరికొన్ని శ్మశానాలకు రహదారి సైతం లేదాయె. కొన్ని శ్మశానాలు సైతం కబ్జాదారుల కబంద హస్తాల్లోకి చేరాయి. ఇలా ఏ శ్మశానాన్ని చూసినా దయనీయ స్థితిలోనే దర్శనమిస్తున్నాయి. శ్మశానాల అభివృద్ధి కోసం అధికారులు, పాలకులు హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా 29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశాన వాటికలో పరిధిలో 6వేల జనాభా ఉన్నా ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాలు చేద్దామంటే శ్మశానంలో కొలువైన సమస్యలు మరింత వేదనకు గురిచేస్తున్నాయి. శ్మశానమంతా కంపచెట్లతో కూరుకుపోయి, మురుగు నీరంతా శ్మశానంలోకి రావడంతో నడుముల్లోతు నీటిలోనే మృతదేహానికి అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. దీంతో శవం త్వరగా వాసన వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి చుట్టూ కంపచెట్లు అల్లుకుపోవడంతో మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అనేక మార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసు కువెళ్లినా ఫలితం శూన్యం. ఎన్నికల సమయంలో రాజకీయ నేతలు ఓట్లకోసం శ్మశానాలను అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడం, గెలిచిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంపచెట్లతో మూసుకుపోయిన శ్మశానవాటిక రహదారి

అధికారులు, పాలకులు స్పందించాలి



29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశాన వాటికలో 6వేల మంది జనాభా నివసిస్తున్నా శ్మశాన వాటికలో వసతులులేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శ్మశాన వాటికలో కంపచెట్లు విపరీతంగా పెరిగి కనీసం నీటి సౌకర్యం కూడా లేకుండా పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అనేకమార్లు అధికారులు, రాజకీయ నేతల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి.

డి. విశ్వనాథనాయుడు, 29వ వార్డు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఎవరైనా మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృతదేహం పూడ్చేందుకు గుంత తీయాలన్నా కంపచెట్లు తొలగించాలి, ఇక్కడకు చేరిన మురుగునీరంతా తొలగించాలి. చేరి ఉండడంతో మృతదేహాన్ని అక్కడే ఖననం చేయాల్సిన దుస్థితి ఉంది. రహదారి అంతా కంపచెట్లతో మూసుకుపోవడంతో చాలా కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కంపచెట్లను తొలగించాలి.

బద్రి, 29వ వార్డు

గండి నిత్యాన్నదానానికి లక్ష విరాళం



దాతకు రసీదు అందిస్తున్న ఈఓ, అర్చకులు

చక్రాయపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యన్నదాన పథకానికి శనివారం పాలెంపల్లె భక్తుడు మేకల హనుమంతయ్య, కుమారుడు ఆంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని సమర్పించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వచనాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

గండి వీరాంజనేయస్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రెండో శనివారం, భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామివారి దర్శనానికి భారీఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లలో రద్దీగా కనిపించారు. భక్తులు పాపాఘ్నిలో స్నానాలాచరించి అంజన్నను దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం రూ.4,62,096 ఆదాయం వచ్చింది.

రేపు లాటరీ ద్వారా షాపుల ఎంపిక

కడప క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ జిల్లా గీత కులాల కోసం మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను లాటరీ విధానం ద్వారా నిర్వహించనున్నట్లు కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తెలిపారు. లాటరీ ప్రక్రియను కలెక్టరు అధికారికంగా నిర్వహించనున్నారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తారన్నారు. పూర్తివివరాలతో సమర్పించిన దరఖాస్తు కాపీలు,నాన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుం చలానా, లావాదేవీ పూర్తయిన నిర్ధారణగా, లాటరీ హాలులో ప్రవేశించేందుకు అవసరమైన పాస్, ఏ3-బీ ఫారం దరఖాస్తుదారుల గుర్తింపు, ఇతర వివరాల పరిశీలన కోసం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, తహసీల్దార్లు జారీ చేసిన అదనపు (సప్లిమెంటరీ) ఉప కులధ్రువీకరణ పత్రం చూపాలన్నారు. అభ్యర్థులు లాటరీ ప్రక్రియకు ఉదయం 8గంటల్లోపు సభాభవన్‌లో హాజరవాలి. అభ్యర్థులు తమ పత్రాలను ముందుగా సిద్ధం చేసుకుని లాటరీ అన్ని నిబంధనలు పాటించాలి. లాటరీ ప్రాసెస్ పూర్తయిన అనంతరం ఎంపికైన అభ్యర్థులకు వెంటనే తగిన మార్గదర్శకాలు ఇవ్వబడతాయి.

లిఫ్ట్ పేరుతో చోరీలు : డీఎస్పీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంలో వెళుతూ బస్సు, ఆటో కోసం ఎదురుచూస్తున్న వారికి లిఫ్ట్ ఇస్తామని చెప్పి దారిలో వారిని కొట్టి డబ్బులు, బంగారు ఎత్తుకెళుతున్నారని డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు నిందితుల అరెస్టును చూపిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వరుస దోపిడీలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ముగ్గురు సభ్యుల అంతర్‌జిల్లా దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పొన్నతోట జయచంద్ర రిమాండ్‌లో ఉండగా ప్రస్తుతం నాగరాజు, వెంకటరమణను అరెస్టు చేశామన్నారు. నాగరాజు ద్విచక్ర వాహనంలో వెళుతూ వాహనాల కోసం ఎదురుచూస్తున్న వారిని లిఫ్ట్ ఇస్తామని చెప్పి దారిలో వారి వద్ద నుంచి డబ్బులు, బంగారు ఎత్తుకెళుతున్నాడన్నారు.

ఆటోడ్రైవరు నిజాయితీ



కడప క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పై వంద రూపాయల నోటు కళ్లబడితే అటు ఇటు చూసి చటుక్కున జేబులో వేసుకుని వెళుతున్న కాలంలో తన ఆటోలో మరిచి పోయిన నగదు, ఏటీఎం కార్డులున్న బ్యాగును పోలీసులకు అప్పగించాడు. ఎన్జీవో కాలనీ మహిళ మోర్ సూపర్‌మార్కెట్ దగ్గర ఆటో ఎక్కి ఓంశాంతినగర్ వద్ద దిగింది. అయితే తన హ్యాండ్‌బ్యాగ్ ఆటోలోనే మరిచిపో యింది. కొంత సేపటికి విషయం గమనించిన ఆటోడ్రైవరు రవిశంకర్ బ్యాగును చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో అప్పగించాడు. సదరు బ్యాగును పోలీసులు పరిశీలించగా ఏటీఎం కార్డులు, కొంత నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయి. వెంటనే పోలీసులు ఆ మహిళను స్టేషన్‌కు రప్పించి ఆటోడ్రైవరు సమక్షంలో బ్యాగును అప్పగించారు. చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్ డ్రైవరును అభినందించారు.

మహిళ ఆత్మహత్య

చాపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాళెం గ్రామంలో శనివారం వరలక్ష్మి (28) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వరలక్ష్మికి ముగ్గురు ఆడపిల్లలు పుట్టినందున ఆమెను భర్త వేదించేవాడన్నారు. కొన్ని నెలలుగా భర్త వేధింపులు భరించలేక మాత్రలు మింగిందని వరలక్ష్మి తల్లి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

కొండకు ఆకతాయిల నిప్పు

కాలిపోయిన పాలీషీట్, పీవీసీ పైపులు



కాలిపోయిన ఫారమ్ పాండ్ పాలీషీట్

లింగాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండకు ఆకతాయిలు శుక్రవారం రాత్రి అగ్గిపెట్టడంతో లింగాల వాసి కుమ్మెత రామాంజనేయరెడ్డి ఫారమ్ పాండ్ పాలీషీట్, 25పీవీసీ పైపులు, 30 స్ప్రింక్లర్స్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రైతుకు సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. కొండకు దిగువన తోట ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

'కృష్ణా' కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ నేత తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రాయలసీమలో ఉన్న శ్రీశైలం జలాశయానికి సమీపంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. మంత్రులకు ర్యాంకింగ్ ఇవ్వడం సెల్ఫ్‌గోల్‌తో సమానమన్నారు. ర్యాంకింగ్‌లో ముఖ్యమంత్రికి 6వ ర్యాంకు, లోకేష్‌కు 8, పవన్‌కు 10వ ర్యాంకు ద్వారా ప్రజల్లో, కార్యకర్తల్లో మిగతా మంత్రుల్లో వారిపట్ల చులకన భావం వస్తుందన్నారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వెల్ఫేర్ డైరెక్టర్

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాలను వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకులు ఎ.మల్లికార్జున శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మెనూ ఏ విధంగా అమలవుతోందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. ఎంఆర్ శంకరన్ నాలెడ్జి కేంద్రాలు బీసీ వసతి గృహాల్లో ఏర్పాటు చేయబడిందని వాటిని వినియోగంలోకి తీసుకు వచ్చి విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బీసీ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.55లక్షలు కేటాయించిందని ఈ మాసాంతానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

కమలాపురంలో వివాహిత అదృశ్యం



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రాస్‌రోడ్డు నివాసం ఉంటున్న వివాహిత పేర్ల భార్గవి (32) శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ భార్గవి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిందని, ఆటోలో కడప వైపునకు వెళ్లినట్లు వారు తెలిపారన్నారు. భార్గవి ఇంటి నుంచి బయటికి వెళ్లే సమయంలో బ్లూకలర్ డ్రెస్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100532, 9121100529 నెంబర్లకు తెలియజేయాలని, కేసు నమోదు చేశామన్నారు.

బ్రహ్మం మృతిపై నిజాన్ని వెల్లడించాలి



మాట్లాడుతున్న వనబాక శివలక్ష్మి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ఇటుకల బట్టీలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వనబాక బ్రహ్మం మృతిపై నిజాలు వెల్లడించాలని మృతుడి సోదరి వనబాక శివలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఇటుకల బట్టీ యజమాని 'మీ అన్న ఉరి వేసుకుని చనిపోయాడని' ఫోన్ ద్వారా సమాచారం అందించాడన్నారు. ఆత్మహత్య చేసుకుంటే సంఘటనా స్థలంలో పోలీసు విచారణ, పంచానామా చేయకుండా మృతదేహాన్ని ఆస్పత్రికి ఎలా తరలించారని ఆమె ప్రశ్నించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని చూడటానికి కూడా కుటుంబీకులను అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడు మృతిపై అనుమానం ఉందని, ఈ సంఘటనపై పోలీసుల తీరు అనుమానాస్పదంగానే ఉందన్నారు. సంఘటన స్థలంలో సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్టులను తారుమారు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో వనబాక సంధ్యావలి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గ్రామీణ రహదారులకు మోక్షం ఎప్పుడు?

● కంకర తేలిన రోడ్లు ● కాలి నడక కూడా కష్టమే ● అదుపు తప్పుతున్న వాహనాలు

రామాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు నడిచి వెళ్లడానికి సైతం వీలు లేనంత అధ్వానంగా మారడంతో ఐదేళ్లుగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామాపురం మండలంలోని కల్పనాయునిచెరువు నుంచి మూలపల్లికి వెళ్లే రోడ్డు కంకర తేలిపోవడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కల్పనాయునిచెరువు గ్రామం లో సచివాలయం ఉన్నందున మూలపల్లి వాసులు తరచూ ఇక్కడికి రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారడంతో చుట్టూ తిరిగి 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీలకంట్రావుపేట నుంచి సీకే రోడ్డు వరకు మరమ్మతులకు గత ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించినా, పనులు చేయకపోవడంతో ఇబ్బందిగా ఉందని, ఇకనైనా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కుమ్మర పల్లి పంచాయతీ మన్నేరువాండ్లపల్లెనుంచి నూరకవాండ్లపల్లె సబ్‌స్టేషన్ వరకు ఉన్న రోడ్డు గుంతల మయమైందని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకొని రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.


కంకర తేలిన నీలకంట్రావుపేట రోడ్డు


అధ్వానంగా మారిన మూలపల్లి రోడ్డు

ప్రయాణం నరకప్రాయం



కల్పనాయునిచెరువు సచివాలయం నుంచి మూలపల్లె వెళ్లే రోడ్డు కంకర తేలడంతో ఆటోలో గానీ, స్కూటర్‌లో కానీ వెళ్లడం కష్టంగా ఉంది. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

- తొట్టి వెంకట్రమణ

కాలి నడక కూడా కష్టమే..



కల్పనాయునిచెరువు రోడ్డుపై మూలపల్లి నుంచి కల్పనాయునిచెరువులోని గ్రామ సచివాలయానికి ఆటోలోగానీ, కాలినడకన గానీ వెళ్లడం కష్టంగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలి

- ఎర్రని మల్లేశ్

ఏఎస్పీతో వాలీబాల్ క్రీడాకారుల భేటీ


ఏఎస్పీని సత్కరిస్తున్న వాలీబాల్ క్రీడాకారులు

రాజంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేతో శనివారం వాలీబాల్ సీనియర్ కోచ్, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ షామీర్ బాషా, వాలీబాల్ క్రీడాకారులు కరీముల్లా, నజీర్, ప్రశాంత్, అలీ, దినేష్ తదితరులు కలిశారు. రాజంపేట క్రీడా మైదానంలో ప్రతిరోజు వాలీబాల్ ఆడుతున్నామని, ఆటగాళ్లను ప్రోత్సహించడంలో భాగంగా మీరు కూడా వచ్చి ఆడాలని విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఏఎస్పీని సత్కరించారు.

నేడు కంటి వైద్యశిబిరం

పుల్లంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌బీవీడీ సభ క్రీడా మైదానంలో ఆదివారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎంతో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భేటీ


సీఎం చంద్రబాబుతో ప్రతాప్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీలో నెలకొన్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మదనగోపాలపురం రోడ్డును పునరుద్ధరించాలని కోరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు

రైతు ఉత్పత్తుల సేకరణ కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి


కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

వీరబల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వీరబల్లి మండల రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి కేంద్రాన్ని ఉపయోగించాలన్నారు. వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఎం ఖాదర్‌వలి, ఎఫ్‌పీవో సీసీ గంగాధరం, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేశ్, మండల రైతు సమాఖ్య అధ్యక్షులు రాచన్న, కార్యదర్శి రామయ్య, కోశాధికారి రాంప్రసాద్, అకౌంటెంట్ మరియమ్మ పాల్గొన్నారు.

ఢిల్లీలో బీజేపీ చరిత్రాత్మక విజయం

● వాడవాడలా మిన్నంటిన సంబరాలు


రాయచోటి: ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు


రాజంపేటలో బీజేపీ పార్లమెంట్ కార్యాలయం వద్ద సంబరాలు ప్రారంభిస్తున్న నేతలు


రైల్వే కోడూరు సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చరిత్రాత్మక విజయం సాధించడంతో బీజేపీ సీనియర్ నాయకుడు అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద బీజేపీ నేతలు, కార్యకర్తలు బాణసంచా పేల్చి, దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన అవినీతి, అక్రమాల కారణంగా ప్రజలు ఆ పార్టీపై విశ్వాసం కోల్పోయారని, అందుకే మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకి భారీ విజయాన్ని కట్టబెట్టారన్నారు. అదే విధంగా ఏపీ కూటమి నేతలు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రచారం మంచి విజయాన్ని అందించిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రాజశేఖర్ రెడ్డి, నాగార్జున, వెంకట్రామరాజు, డాన్‌శీను, జనసేన నాయకులు రామాశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు బైకు ర్యాలీ నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. నరేంద్రమోదీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సాయిలోకేశ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో 28 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారం చేపట్టడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా జనసేనపార్టీ నాయకుడు శ్రీనివాసరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సునీత నారాయణవర్మ, మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, జనసేన నాయకురాలు రెడ్డి రాణి, మాజీ సర్పంచ్ తోట రామయ్య తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

రైల్వేకోడూరు రూరల్: ఢిల్లీ గడ్డపై విజయం దేశ ప్రజలకు అంకితమని మండల బీజేపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ తెలిపారు. ఢిల్లీలో బీజేపీ అఖండ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా శనివారం పట్టణంలోని టోల్‌గేట్ వద్ద బీజేపీ నాయకులు కార్యకర్తలు బాణసంచా కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలన, ముందుచూపు, సుస్థిర, సమర్థవంతమైన పాలనకు ప్రజలు ఆకర్షితులై ఢిల్లీ పీఠాన్ని కట్టబెట్టారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, దరిశా వెంకటరెడ్డి, జయప్రకాష్, నారాయణ వర్మ, శంకర్ రాజు, వాకచర్ల సుబ్బారావు, కాలప్ప గారి రాము, బాలసుబ్రహ్మణ్యం, సాయి ఆచారి, సుబ్బారావు, సుగవాసి మల్లికార్జున రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలో మండల బీజేపీ అధ్యక్షుడు కమలాపురం మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేస్తున్నారు. బీజేపీ నాయకులు శ్రీనివాసులు, కూటమి నాయకులు సౌభాగ్యవతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల బీజేపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. బీజేపీ యువజన విభాగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఢిల్లీ గడ్డపై విజయం సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

సుండుపల్లె: దేశంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని నాయకులు తెలియజేశారు. భవిష్యత్తులోనూ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పెన్నా బాధిత రైతులకు న్యాయం జరిగేనా?

సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెన్నానది వరద కారణంగా పంట భూములు కోతకు గురై రోడ్డున పడిన రైతు కుటుంబాలకు న్యాయం జరిగేనా అన్ని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. 2021-22లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా పెన్నానది పోటెత్తడంతో నదీతీరాన్ని ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయి. ఈ ఉత్పాతంలో సుమారు 63 ఎకరాల్లో చేతికొచ్చిన పంటతోపాటు, భూమి సైతం కోతకు గురయ్యాయని రైతులు చెబుతున్నారు. ముందుముందు మిగిలిన భూములైనా కోతకు గురి కాకుండా గత ప్రభుత్వంలో నామమాత్రంగా పనులు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. భూములు కోతకు గురికాకుండా రివిట్‌మెంట్ చేయాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. కోతకు గురైన రైతు పొలాలకు నష్ట పరిహారం చెల్లింపు విషయమై ఇరిగేషన్‌శాఖ ఏఈ సాయికృష్ణ మాట్లాడుతూ పెన్నానదిలో నీటిమట్టం తగ్గాక కోతకు గురైన పొలాను సర్వే చేసి, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, వారి ఆదేశాల మేరకు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.


కోతకు గురైన భూమి

రాజంపేటలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎన్డీయే కూటమి నేతల ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం రూ.50 వేలు, జనసేనపార్టీ నాయకులు ఎల్లటూరు శ్రీనివాసరాజు రూ.30 వేలు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ రూ. 15 వేల ఆర్థిక సాయంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి. లక్ష్మీ నారాయణ, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా, రాజంపేట మండల టీడీపీ నాయకులు ఊటుకూరు చెంగల్‌రాయులు, జనసేన నాయకుడు అబ్బిగారి గోపాల్, టీడీపీ నాయకులు మేకా నరసింహులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

రాయచోటిలో ప్రజల పరిస్థితి దుర్భరం

● డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్


9వ వార్డులో ముస్లిం మైనార్టీ మహిళలతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజల పరిస్థితి దుర్భరంగా తయారైందని డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. శనివారం అయన రాయచోటి పట్టణంలోని 9వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా అభివృద్ధి సున్నా అన్నారు. మున్సిపాలిటీలోని పలు వీధులు డంప్ యార్డులను తలపిస్తున్నాయని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ అన్నమయ్య జిల్లా కేంద్రం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. పలు వార్డుల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, వీధులు డంప్ యార్డులను తలపిస్తున్నాయని, నడి వీధుల్లో కాలువలతో, దోమల బెడదతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీ అధికారులు, ప్రభుత్వ అధికారులు వెం టనే స్పందించి స్థానిక సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ సెక్రటరీ అమీర్‌బాషా, రాయచోటి నాయకులు మన్సూర్‌అలీఖాన్, ఖాదర్‌ఖాన్, దర్బార్ బాషా, యహియా, బాబా సర్దార్, రియాజ్, ఇమ్రాన్, అమీర్ మున్నా, నజీర్, హఫీజుల్లా, సుండుపల్లె మండల అధ్యక్షులు సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ సబ్‌స్టాఫ్ తొలగింపు అన్యాయం


భిక్షాటన చేస్తున్న కార్మికులు, నాయకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ స్కావెంజర్స్, హౌస్‌కీపింగ్, సబ్‌స్టాఫ్‌గా పని చేస్తున్న పునరావాస కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వకపోగా, ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమంటూ నిరసన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వాలని అడిగినందుకు నోటీసులు కూడా ఇవ్వకుండా తొలగించారన్నారు. ఈ విషయంపై అధికార పార్టీ నాయకులు, టీడీపీ ఇన్‌చార్జి కూడా చైర్మన్ రూపానందరెడ్డి, జనసేన శాసనసభ్యుడు అరవ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన లెటర్ ఇచ్చి విధుల్లోకి తీసుకోమని చెప్పినా క్రాంటాక్టర్ కానీ, ఏపీఎండీసీ యాజమాన్యం కానీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికి నాలుగు నెలలుగా జీతాలు లేకుండా స్కూల్ గేటు వద్ద పడిగాపులు కాస్తున్నా పట్టించుకోలేదంటూ మంగంపేట వీధుల్లో జోలె పట్టి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, బాధితులు పి.లత, లక్ష్మీదేవి, శాంతమ్మ, రాణి, గ్రేస్ అమ్మ, చిట్టెమ్మ, దేవి, ప్రసన్న, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. శనివారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న రాష్ట్రంలోని అన్ని గ్రామాల సమస్యలపై తాడేపల్లిలో ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జాతీయ ఉపాధిలో పనిచేస్తున్న కూలీలకు జాబ్ కార్డులు ఏర్పాటు చేసి పనిముట్లు ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు కూలి రూ. 700లు ఇవ్వడంతోపాటు 365 రోజులు పనులు కల్పించాలని, ఉపాధి కూలీలు మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 20 లక్షలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఐదు కిలోమీటర్ల దూరంలో పనులు కల్పిస్తే రవాణా చార్జీలు ఇవ్వాలని కోరారు. పని ప్రాంతాలలో షామియానాలు వేయాలని, వేసవి వచ్చేసింది కాబట్టి మజ్జిగ తదితరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు సిమెంట్ రోడ్లు వేయలేదని, తాగునీటి సమస్యలు ఉన్నాయని, గిరిజన, దళిత భూములను కబ్జాదారు లు ఆక్రమించుకుని ఉన్నారని తెలిపారు. చాలా సమస్య లను ప్రజలు ఎదుర్కొంటున్నారు. జిల్లా నుంచి వందలాది మంది కార్మికులు ధర్నాకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జయరామయ్య, మల్లికా రమణ య్య, వెంకటరమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న భక్తులు

రామాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో వెలసిన మరకత శివలింగం శివాలయంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ధ్వజస్తంభం, పార్వతీ, మూలవర్ల విగ్రహాల ప్రతిష్ఠ శిఖర ప్రతిష్ఠకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మన్నేరు రాధాకృష్ణ, విజయలక్ష్మి, మన్నేరి శివ శంకర్, ఇందిరా, జనార్దన్, బాలు, లత, బాలిశెట్టి శ్రీనివాసులు, లక్ష్మీకళ హాజరై శివపార్వతులకు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, గంగ పూజ, కలశపూజ, యంత్రపూజ, మహామంగళహారతి, అనంతరం పాట కచేరి, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, అగ్నిదీక్ష, హోమం, మూలమంత్రం, మంత్ర జపాలు, జల నివాసం మంగళహారతి నిర్వహించారు. భక్తులందరికీ అతికారి వెంకటసుబ్బయ్య అన్నదానం చేశారు. రాత్రికి కడవకూటివాండ్లపల్లెకు చెందిన రవిభజన బృందం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఉత్తమం


ఘన జీవామృతం తయారు చేస్తున్న ఎంసీఏ బుల్లయ్య

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు, భూమికి ఎంతో మేలు జరుగుతుందని అగ్రికల్చర్ అధికారి మల్లిక తెలిపారు. మండల ఇన్‌చార్జి ఎంసీఏ బుల్లయ్య ఆధ్వర్యంలో బాల్‌రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఎన్.కుమారికి చెందిన పొలంలో ఘన జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులకు కషా యాలు, పద్ధతులు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీఆర్ రత్నమ్మ, ఎంసీఏ బుల్లయ్య, రైతులు హాజరయ్యారు

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న పక్కీరయ్య

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి):కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని మండల తెలుగు యువత అధ్యక్షుడు కొలిమి పక్కీరయ్య తెలిపారు. రాష్ట్ర తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం ఎలా అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కేవలం రెండునెలలు మాత్రమే ఉన్నాయని, పూర్తి స్థాయిలో విద్యార్థులు చదువుపైనే దృష్టిపెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. తెలుగుయువత ఆధ్వర్యంలో మెటీరియల్ అందిస్తామని బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు,

రజకుల సమస్యలు పరిష్కరించండి


డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రజక సంఘం నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం రజక సంఘం నేతలు శనివారం నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో రజకులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నింటిలో రజకులకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రజక సంఘం అధ్యక్షుడు టీ. రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు ఎంవీ రమణ, లక్ష్మీనారాయణ, కార్యదర్శి వీ. శ్రీనివాసులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆశయం ఘనం... అమలు అస్తవ్యస్తం



పీలేరు పట్టణం కట్టుకాలువ వీధిలోని ఆర్వో వాటర్ ప్లాంటు



కలకడ వారపు సంతలో మూతపడ్డ ఆర్వో ప్లాంటు

- త్రిశంకు స్వర్గంలో ఆర్వో వాటర్ ప్లాంట్లు
- జీతాల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచితంగా సురక్షిత తాగునీరు అందిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీలేరు నియోజకవర్గంలో ఇబ్బడి ముబ్బడిగా ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులతో కొన్ని, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులతో మరికొన్ని, గ్రామ పంచాయతీ నిధులతో ఇంకొన్ని నిర్మించారు. 2021 నుంచి 2024 వరకు ఆదాయం ఉండే మేజర్ పంచాయతీల దగ్గర నుంచి నామమాత్రం ఆదాయం లేని పంచాయతీల్లోనూ వీటిని నిర్మించారు. నిర్మించిన మూడేళ్ల వరకు ఏపీఎండీసీ సీఎస్‌ఆర్ నిధులతో వాటిని నిర్వహించారు. ఆ సమయంలో ఆయా ప్లాంట్ల మొత్తం నిర్వహణతో పాటు ఆపరేటర్ల జీతభత్యాలు కూడా ఇచ్చేవారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో ఆ బాధ్యతల నుంచి ఏపీఎండీసీ తప్పుకుంది. అప్పటి నుంచి వాటి నిర్వహణ బాధ్యత, ఆపరేటర్ల జీతభత్యాలు ఆయా పంచాయతీల మీద పడింది. ప్లాంట్ల నిర్వహణతో పాటు ఆపరేటర్ల జీతభత్యాలు ఏ పద్దు కింద చెల్లించాలో తెలియక చాలా పంచాయతీల్లోని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అలా పీలేరు పట్టణంలో ప్రస్తుతం నడుస్తున్న 25 ప్లాంట్ల ఆపరేటర్లు నాలుగు నెలలుగా తమకు జీతాలు లేవని వాపోతుండగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తాము చెల్లించలేమంటూ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వాటర్ ప్లాంట్ల ఏర్పాటును తమ ప్రచార అస్త్రంగా మలుచుకున్న వైసీపీ నాయకులు వాటి నిర్వహణ, ఆపరేటర్ల జీతాలు వంటి అంశాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో ఈ సమస్య నెలకొందని, ఆదాయం లేని చోట్ల నీళ్లను నామమాత్రపు ధరకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు పెదవి విరుస్తున్నారు.

వైసీపీ ప్రచార అస్త్రంగా ఆర్వో వాటర్ ప్లాంట్లు

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్య ఆహార అలవాట్లలో భాగంగా గడిచిన దశాబ్ద కాలంగా ఆర్వో నీటి వినియోగం పెరిగింది. చిన్న చిన్న ఊళ్లలో సైతం ప్రైవేటు వ్యక్తులు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అంటూ క్యాన్ నీళ్లను విక్రయించేవారు. ఇదే అంశాన్ని 2019లో వైసీపీ తమ ప్రచార అస్త్రంగా మలుచుకుంది. ప్రజలకు సురక్షిత తాగునీరు అందివ్వడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని, తాము అధికారంలోకి వస్తే ఊరూరా ఉచితంగా ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని పీలేరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్లమెంటు నియోజకవర్గ ప్రాంత అభివృద్ధి నిధులతో పీలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. కరోనా సమయంలో ఎంపీల నిధులకు అడ్డుకట్ట పడడంతో ఇచ్చిన హామీని నెరవేర్చుకునే క్రమంలో మేజర్ పంచాయతీల్లో పంచాయతీ నిధులతో వాటిని నిర్మించారు. చిన్న చిన్న గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నం కావడంతో ఏపీఎండీసీ సామాజిక బాధ్యత నిధులతో కొన్నింటిని నిర్మించారు. స్థానిక నాయకుల నుంచి డిమాండ్లు అధికం కావడంతో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అధిక శాతం ప్రాంతాల్లో ప్లాంట్లను ఇబ్బడిముబ్బడిగా నిర్మించారు. నిర్మాణ సమయంలో ఆయా ప్లాంట్ల నిర్వహణను మూడేళ్ల పాటు ఏపీఎండీసీ ద్వారా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్లాంట్ల నెలవారీ నిర్వహణ తోపాటు వాటిల్లో పనిచేసే ఆపరేటర్లకు ప్రతి నెలా రూ.6200 జీతం, రూ.1300 పీఎఫ్ చెల్లించేవారు. ఆ క్రమంలో పీలేరు మండలంలోని పీలేరు పట్టణంలో దశల వారీగా 25 ప్లాంట్లు, వేపులబైలు, బోడుమల్లువారిపల్లె, బాలంవారిపల్లె పంచాయతీల్లో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఏపీఎండీసీ నిర్వహణ ఉన్నన్నాళ్లూ నీటిని ఉచితంగా అందజేశారు. 2024 మే మాసంలో ఆ బాధ్యతల నుంచి ఏపీఎండీసీ తప్పుకోవడంతో సమస్య ప్రారంభమైంది.

జీతాల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు

2024 మే వరకు సాఫీగా జీతాలు అందుకున్న ఆపరేటర్లు ఆ తరువాత నెల నుంచి జీతం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పీలేరు పట్టణంలోని 25 ఆపరేటర్లు తమ జీతాల కోసం పంచాయతీ అధికారుల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడం, పీలేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరగడం, నిధులు దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలి అప్పటి ఈవో, సర్పంచ్ చెక్ పవర్ రద్దు కావడంతో వీరి కష్టాలు అధికమయ్యాయి. ఆయా ప్లాంట్లలో వైసీపీ సానుభూతిపరులనే ఆపరేటర్లుగా అప్పట్లో నాయకులు నియమించడంతో చాలామంది ప్రభుత్వం మారడంతో ఆ పని వదిలేసుకున్నారు. అలాంటి చోట్ల స్థానిక టీడీపీ నేతలు, పంచాయతీ అధికారులు కొత్త వారిని నియమించి ప్లాంట్లను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆపరేటర్ల జీతాలతో పాటు ప్లాంట్ల నిర్వహణ పంచాయతీ అధికారులకు కత్తి మీద సాములా మారింది. వాటర్ ప్లాంట్ల నిర్వహణ పంచాయతీ విధుల్లో లేకపోవడంతో ఆపరేటర్లకు ఏ పద్దు కింద జీతాలు చెల్లించాలో తెలియక వారు తలలు పట్టుకుంటున్నారు. తమకు జీతాలు లేవని పలువురు ఆపరేటర్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని ఆశ్రయించడంతో ఆయన గత ఏడాది అక్టోబరులో అందరికీ నెలకు రూ.6 వేలు చొప్పున మూడు నెలల జీతం ఇప్పించారు. అప్పటి నుంచి నేటి వరకు ఆపరేటర్లు జీతాల కోసం ఎదురుచూస్తూ పనిచేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల్లో కొన్ని చోట్ల పంచాయతీల ఆధ్వర్యంలో ప్లాంట్లు నడుస్తున్నప్పటికీ వాటి నిర్వహణ కోసం ప్రజల నుంచి క్యాన్ నీటికి రూ.2 నుంచి రూ.5 దాకా వసూలు చేస్తున్నారు. ఆ డబ్బులతో ఆపరేటర్ల జీతం, ప్లాంట్ల నిర్వహణ చేస్తున్నారు.

డీపీవో దృష్టికి జీతాల సమస్య


ఆర్వో ప్లాంట్ల ఆపరేటర్ల జీతాల అంశాన్ని పీలేరు పంచాయతీ ఈవో గురుమోహన్ గురువారం జిల్లా ఇన్‌ఛార్జ్ డీపీవో మస్తాన్‌వలీ దృష్టికి తీసుకెళ్లారు. జీతాల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకోవాలని, అనుమతులు వచ్చిన తరువాతనే వారిని జీతాలు చెల్లించగలమని ఆయన స్పష్టం చేశారు. అదే విషయాన్ని ఈవో గురుమోహన్ ఆపరేటర్లకు తెలియజేశారు. తాము ఇది వరకే జిల్లా పంచాయతీ అధికారికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిర్ణయం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్వో ప్లాంట్లు ఎక్కడెక్కడ-ఎన్నెన్ని

పీలేరు మండలంలోని పీలేరు పట్టణంలో మొత్తం 25 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రస్తుతం నాలుగు ప్లాంట్లు సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా మూతపడగా 21 పనిచేస్తున్నాయి. కలికిరి మండలంలోని కలికిరి పంచాయతీలో ఆరు, గుట్టపాళెంలో నాలుగు, రంగనాథపురంలో ఒకటి, మహల్, కొటాల, మేడికుర్తి పంచాయతీల్లో ఒక్కొక్క ఆర్వో వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో నిధుల కొరత కారణంగా గుట్టపాళెంలోని మూడు ప్లాంట్లు పనిచేయడం లేదు. మహల్‌లోనూ పంచాయతీ నిర్వహించడం లేదు. మిగిలిన చోట్ల నడుస్తున్నాయి. గుర్రంకొండ పట్టణంలో మూడు ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మరో ప్లాంటు ప్రారంభమే కాలేదు. కలకడలో ఏర్పాటు చేసిన రెండు ప్లాంట్లూ ప్రస్తుతం పనిచేయడం లేదు. మరమ్మతుల కారణంగా అవి మూతపడ్డాయి. వాల్మీకిపురం మండలంలో మొత్తం 10 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని గాంధీపేట, గండబోయినపల్లెలోని ప్లాంట్లు ప్రస్తుతం మూతపడ్డాయి.



పీలేరు మండలం మేకలవానికాల్వ గ్రామంలో మూతపడిన ఆర్వో ప్లాంటు



వాల్మీకిపురం మండలం గండబోయినపల్లెలో మూతపడ్డ ఆర్వో ప్లాంటు

క్వారీ సూపర్‌వైజర్ ఆత్మహత్య

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫ్యానుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం బి.కొత్తకోట మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీ ముత్యాలరెడ్డిపల్లె వద్దనున్న ముత్యాలగడ్డ సమీపంలో క్వారీలో ప్రకాశం జిల్లా ఆలూరుకు చెందిన ఆవుల అభిలాష్ (32) ఆరేళ్ల నుంచి సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే ఓ రూంలో ఉంటూ కంకర పనులను పర్యవేక్షించేవాడు. అతడి తండ్రి శ్రీనివాసులు ఇటీవల మృతి చెందాడు. తండ్రిని అమితంగా అభిమానించే అభిలాష్ డిప్రెషన్‌కు లోనయ్యాడు. తీవ్ర మనస్థాపంతో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఏఎస్ఐ బొజ్జేనాయక్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం గ్రామ శివారులోని భాకరాపేట-సిద్దవటం మార్గంలో గ్రామానికి చెందిన రైతు చలపాటి రామసుబ్బయ్య (60) శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళుతుండగా బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు విచారణ చేస్తున్నారు. కారులో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం జూకుంట గ్రామానికి చెందిన కొండలరావు, గీత, కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది

పాఠశాల బస్సు, కారు ఢీ

చిన్నమండెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప- బెంగళూరు రహదారిలోని వండాడి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు, కారు ఢీకొన్నాయి. రాయచోటి నుంచి చిన్నమండెం వైపు విద్యార్థులను తీసుకొస్తున్న బస్సు బెంగళూరు నుంచి రాయచోటి వైపు వస్తున్న కారును ఢీకొంది. ఆ సమయంలో స్కూల్ బస్సులో దాదాపు 50 మందికి పైగా విద్యార్థులున్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.20 లక్షల గోల్‌మాల్?

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పెద్ద స్కాం జరిగిందన్న వార్త శనివారం హల్‌చల్ చేసింది. కస్టమర్లు కుదువపెట్టిన బంగారాన్ని ఆ ఫైనాన్స్ సిబ్బంది తారుమారు చేసి సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ బంగారు కుదువపెట్టిన వారు డబ్బు తెచ్చి తమ బంగారం ఇవ్వమని అడుగుతున్న వారికి సర్వర్ పనిచేయలేదు... నాలుగు రోజులు ఆగి రండి అని చెబుతున్నారని కొందరు, తాము పెట్టిన బంగారంలో కొన్ని వస్తువులు లేవు అంటున్నారని మరికొందరు చెప్పుకొచ్చారు. విషయం దావానలంలా పట్టణం అంతా వ్యాపించడంతో ఆ ప్రైవేట్ ఫైనాన్స్‌లో బంగారం కుదువ పెట్టిన కస్టమర్లు ఒక్కొక్కరుగా బ్రాంచి వద్దకు చేరుకున్నారు. తమ బంగారం ఇవ్వమని కొందరు, ఏమైందని మరికొందరు సిబ్బందిని నిలదీశారు. కాగా ఈ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బంది రూ.లక్షల డబ్బును తమ సొంత అవసరాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వాడేశారని, కంపెనీ ఆడిట్‌లో ఈ విషయం బయటపడినట్లు తెలుస్తోంది. కస్టమర్లు తమ బంగారు నగలు విడిపించుకోవడానికి వచ్చి నగదు చెల్లించినపుడు ఆ నగదును చేతికి తీసుకొని, ఆన్‌లైన్‌లో యాజమాన్యానికి జమ చేయకుండా డూప్లికేట్ రిసిప్ట్‌లు ఇచ్చి, ఆ మొత్తాన్ని వీరు పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఆడిట్‌లో బయటపడటంతో ఆ సిబ్బందిపై చర్యలకు కంపెనీ పూనుకుంది. వీరిపై ఫిర్యాదు చేస్తారా? నగదును రికవరీ చేసి ఊరుకుంటారా అనేది తేలాల్సి ఉంది. బంగారు నగలపై ఎక్కువ రుణం ఇస్తారని వచ్చినందుకు తమకు ఎసరు పెట్టకుండా న్యాయం చేయాలని కస్టమర్లు కోరుతున్నారు.

క్రికెటర్ శివకోటికి ఏఎస్పీ సన్మానం



శివకోటిని సత్కరిస్తున్న ఏఎస్పీ

నందలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బోర్డ్ ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లో నిర్వహించనున్న టీ20, వన్డే సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన నందలూరు మండలవాసి ఏల్చూరి శివకోటిని ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సత్కరించారు. ఆయన క్రీడా జీవితం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో ముందుంటానని ఏఎస్పీ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో అంగన్వాడీ కార్యకర్త మృతి



కవిత (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్త మృతిపై దేవపట్ల పంచాయతీ ఆవులవాండ్లపల్లెవాసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు శనివారం మధ్యాహ్నం అంగన్వాడీ కార్యకర్త రెడ్డిమల్ల కవిత (43) కేంద్రంలోనే ఉరి వేసుకుని మృతి చెందింది. భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లిన ఆయా తిరిగి వచ్చే సరికి ఆమె ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించి, స్థానికులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆమెను రాయచోటి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ భక్తవత్సలం ఆసుపత్రికి చేరుకొని మృతికి కారణాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మేకల చెరువు కబ్జా



మేకల చెరువు అన్యాక్రాంతం చేసి వెంచర్ వేసిన దృశ్యం

- భూమిని చదును చేసి.. ఫెన్సింగ్ ఏర్పాటు
- ఇరిగేషన్‌శాఖ అధికారులు ఎక్కడ ?

సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి పంచాయతీ పరిధిలోని మేకలచెరువును ఆక్రమించి చదును చేసి ఫెన్సింగ్ వేశారు. పునాదులు తీశారు. పశువులకు, వన్య ప్రాణులకు తాగునీటి వనరుగా ఉన్న చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నా, కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సాయికృష్ణ మాట్లాడుతూ మేకల చెరువు అన్యాక్రాంతం అంశాన్ని తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా సర్వే చేయిస్తామని, అన్యాక్రాంతమై ఉంటే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలియజేశారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న ఎమ్మెల్యే

- విడిపించుకు వెళ్లిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు





మట్టి తరలిస్తున్న టిప్పర్, డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం మిల్లు వద్ద సిద్ధం చేస్తున్న లేఅవుట్‌కు అనుమతి లేకుండా మట్టితోలుతున్న టిప్పర్లను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అడ్డుకోగా, దీంతో ఆగ్రహించిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మట్టి టిప్పర్లను విడిపించుకు వెళ్లిన ఘటనతో మదనపల్లె రాజకీయ వేడి 'ఎమ్మెల్యే వర్సెస్ చినబాబు' అన్న రీతిన రాజుకుంది. రెండు నెలలుగా మదనపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నేతలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు వర్గాలుగా విడిపోయి, ఒక వర్గంపై మరొక వర్గం పరస్పరం విమర్శలు చేసుకోవడం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన ఈ వర్గాల మధ్య మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది. వివరాల్లోకి వెళితే...

మదనపల్లె మండలం సీటీఎం మిల్లు కొనుగోలు చేసిన వ్యక్తులు అక్కడ మిల్లు భవనాలను తొలగించి ఖాళీ అయిన 32 ఎకరాల భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం లేఅవుట్ సిద్ధం చేస్తున్నారు. ఈ లేఅవుట్‌ను చదును చేసేందుకు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నారు. ఈ క్రమంలో సీటీఎం గ్రామంలో ఓ లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎదుటకు మట్టి టిప్పర్లు వచ్చాయి. దీంతో వాటిని ఆపించిన ఎమ్మెల్యే మట్టి తోలేందుకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. అనుమతి లేకుండా అక్రమంగా మట్టితోలుతున్న వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడికి చేరుకున్న వీఆర్‌వోలు మునస్వామినాయక్, కళ్యాణి టిప్పర్ డ్రైవర్ నుంచి తాళాలు తీసి పెట్టుకుని, మట్టితో వున్న టిప్పర్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్లను అడ్డుకున్నది ఎవరంటూ ఆగ్రహించారు.

అంతేకాకుండా వీఆర్‌వో మునస్వామి, కళ్యాణిలను పిలిపించి వారి దగ్గర ఉన్న టిప్పర్ తాళాలను తీసుకుని టిప్పర్‌ను అక్కడి నుంచి పంపించి వేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మట్టి రవాణాకు అనుమతి దొరకలేదని, సోమవారం నిబంధనలు అనుసరించి మైనింగ్ ఏడీ నుంచి మట్టి రవాణాకు అనుమతి తీసుకుంటారని చినబాబు తెలిపారు. కాగా ఈ దృశ్యాలను అటు ఎమ్మెల్యే వర్గీయులు, ఇటు చినబాబు వర్గీయులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మదనపల్లె టీడీపీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు, శనివారం ఇద్దరు నేతలు వీధిలోకి రావడంతో ఒక్కసారిగా మంటలు రాజుకున్నట్లు అయ్యిందని ప్రజలు వాపోతున్నారు.

బెంగళూరు టు హార్సిలీహిల్స్

ఉల్లాసంగా..ఉత్సాహంగా యువత సైక్లింగ్



బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీహిల్స్‌కు శనివారం ఓ యువతీ, యువకుల బృందం సైకిళ్లపై వచ్చింది. బెంగళూరులోని పలు సైక్లింగ్ క్లబ్‌లు అప్పుడప్పుడూ ఇలాంటి ఈవెంట్లను నిర్వహిస్తుంటాయి. శనివారం ఉదయం 6 గంటలకు 60 మందితో కూడిన ఓ బృందం బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి హార్సిలీహిల్స్‌కు బయలుదేరింది. హొస్కోట, చింతామణి, తాడిగోళ్ల క్రాస్, గౌనిపల్లె, బి.కొత్తకోట మీదుగా హార్సిలీహిల్స్‌కు మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకున్నారు. సైకిళ్లకు అమర్చిన జీపీఎస్ చిప్ ద్వారా వారి కదలికలను ఆర్గనైజర్లు అబ్జర్వేషన్‌లో పెట్టారు. ఈ సందర్భంగా సైక్లింగ్ చేస్తూ వచ్చిన యువకులు మాట్లాడుతూ ఈ సైక్లింగ్‌తో మానసిక ఉల్లాసం, శరీరదారుఢ్యం పెంపొందుతుందన్నారు.

'పోక్సో' కేసులో పోలీసుల నిర్లక్ష్యం

- నిందితుడిని అరెస్టు చేయలేదు
- బాధితురాలి తల్లి ఆవేదన

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల పల్లవోలు పంచాయతీలోని ఓ గ్రామంలో 'పోక్సో' చట్టం కింద నమోదైన కేసులో కలికిరి పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలి తల్లి వాపోయింది. కేసు పురోగతిపై శనివారం ఆమె పీలేరులో విలేఖరులతో మాట్లాడింది. గడి గ్రామానికి చెందిన వైసీపీ నేత జుబేర్ అహ్మద్ కుమారుడు జునైద్ అహ్మద్ గత నెల 23వ తేదీ రాత్రి తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. అదేరోజు తాము ఫిర్యాదు చేసినా కలికిరి పోలీసులు పట్టించుకోలేదన్నారు. చివరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి జోక్యంతో జనవరి 25న జునైద్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడిని అరెస్టు చేయడంలో గానీ, నిందితుడు వినియోగించిన వాహనాన్ని గానీ సీజ్ చేయలేదన్నారు. తాము ఆ సంగతి గురించి పలుమార్లు కోరినా కలికిరి సీఐ రెడ్డిశేఖరరెడ్డి దాటవేత ధోరణిలో సమాధానాలు చెబుతున్నారన్నారు. ఈలోపు నిందితుల బంధువులైన పల్లవోలు పంచాయతీ సర్పంచ్ బీబీ ఆయిషా భర్త ఇస్తియాక్ అహ్మద్, నిందితుడి సమీప బంధువు అయిన మునీర్ తమ ఇంటికే వచ్చి బెదిరించారన్నారు. నిందితుడిని అరెస్టు చేయకుండా తాము పోలీసులకు రూ.5 లక్షలు లంచం ఇచ్చామని, మీకు కూడా రూ.7 లక్షలు పరిహారం చెల్లిస్తామని, ఆ డబ్బు తీసుకుని రాజీకి పోవాలని బెదిరించారన్నారు. రాజీకి అంగీకరించకపోతే లారీలతో గుద్ది తనను, తన భర్తను చంపేస్తామని బెదిరించారన్నారు. వారు బెదిరించిన విషయాన్ని పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడు కలికిరి, గడి పరిసరాల్లోనే స్వేచ్ఛగా తిరుగుతున్నాడని తాము పలుమార్లు పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదన్నారు. కేసును రాయచోటి డీఎస్పీ విచారిస్తున్నారని, ఆయన వచ్చి విచారణ చేసేంత వరకు తాము ఏమీ చేయలేమని ఆయన చెప్పారని వాపోయింది. ఇదే విషయాన్ని తాము ఇటీవల సంబేపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఆయనకు వినతిపత్రం అందజేశామని, అప్పటి నుంచి తమకు బెదిరింపులు ఎక్కువైపోయాయన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు. తమ కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన జునైద్ అహ్మద్, తమను బెదిరించిన మునీర్, ఇస్తియాక్ అహ్మద్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని శనివారం పీలేరులో మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రాణం తీసిన సరదా

నీటిలో మునిగి ఇద్దరు నేపాలి యువకులు మృతి

మృతులు హోటల్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు



డ్యాం వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ, ఫైర్ సిబ్బంది

వల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈదలేడేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వెళ్లిన ఇద్దరు నేపాలి యువకులు బినయ్(22), బీరేంద్ర (30) నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకెళితే...



బినయ్ మృతదేహం - ఫైల్ ఫొటో



బీరేంద్ర మృతదేహం - ఫైల్ ఫొటో

నేపాలీ యువకులు బినయ్, బీరేంద్ర చెన్నూరులో శివరాం ధమ్ బిర్యానీ హోటల్‌లో పనిచేస్తున్నారు. శనివారం హోటల్‌కు సెలవు దినం కావడంతో అక్కడ పనిచేసే సిబ్బంది సరదాగా ఈదలాడేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్టవద్దకు వచ్చారు. ఈ క్రమంలో వారిలో ఇద్దరు గల్లంతయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో సీఐ రోషన్ హుటాహుటిన డ్యాం వద్దకు చేరుకుని ఫైర్ సిబ్బందిని, స్థానిక జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి ఇద్దరు యువకులు మృతదేహాలు బయటికి తీశారు. కాగా మృతుల గురించి ఆరా తీస్తే బతుకుదెరువు కోసం నేపాల్ నుంచి వచ్చి శివరాం ధమ్ బిర్యానీ హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరికి వివాహమైనట్లు తెలిపారు. సీఐ పూర్తి వివరాలు సేకరించి శవాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. డ్యాం వద్దకు వచ్చే పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోతాయని ఆయన హెచ్చరించారు.

గండి ఘాట్‌లో ఇరుక్కుపోయిన లారీ, ఆర్టీసీ బస్సు



లారీ, బస్సు ఇరుక్కుపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

చక్రాయపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానం సమీప ఘాట్‌రోడ్డులో శనివారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా రావడంతో ఇరుక్కుపోయాయి. రెండు కొండల నడుమ రోడ్డు చాలా ఇరుకుగా ఉండడంతో రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోయాయి. దీంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఇరుకైన ప్రదేశం కావడంతో ఏమాత్రం అజాగ్రత్త పడ్డ పాపాఘ్నిలో పడిపోవాల్సిందే. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదపు అంచులో ఇరుక్కుపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు కొంచెం ఓపిక పట్టి ఉంటే వాహనాలు ఇరుక్కుని ఉండేవే కాదన్నారు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ హస్తం ?



స్వాధీనం చేసుకున్న వాహనం, చౌక బియ్యం బస్తాలు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చౌక బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ చోటా నేతల హస్తం కొనసాగుతోంది. అధికారం కోల్పోయినా ఇంకా వారి హవా నడుస్తోంది. తాజాగా పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో స్వాధీనం చేసుకున్న 70 బస్తాల చౌక బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ చోటా నేతల ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో రేషన్ షాపు వద్ద బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున దాడి చేశారు. ఈ ఘటనలో బొలెరో వాహనం సహా 70 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ షాపు నుంచి బియ్యం తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బొలెరో వాహనంతో, బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. సంఘటనపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన మహబూబ్‌బాష, మాబాషను పవర్ హౌస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. నజీరు, పటోడితో కలిసి బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నారని విచారణలో వెల్లడైందన్నారు.

ఓటమి గెలుపునకు నాంది

సాఫ్ట్‌బాల్ కమలాపురం విద్యార్థులు విన్నర్స్



విజేతలుగా నిలిచిన కమలాపురం క్రీడాకారులు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని, గెలుపోటములు సమానంగా స్వీకరించాలని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక డిగ్రీకళాశాలలో జరుగుతున్న అంతర్ కళాశాల క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే క్రీడారంగంలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వినోద్‌కుమార్, కోఆర్డినేటరు వినయ్‌కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పల్లాక్రిష్ణ, పీడీ అద్భుత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలెఫ్‌లో 'ఒంటిచెయ్యి'కి చోటు

వేంపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా అలెఫ్ బుక్ కంపెనీ తీసుకొచ్చిన భారతదేశ వంద కథల పుస్తకంలో వేంపల్లె షరీఫ్ రచించిన 'ఒంటిచెయ్యి' కథను ప్రచురితం చేశారు. కేరళకు చెందిన ప్రఖ్యాత కవి, కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఇండియన్ లిటరేట్ పత్రిక పూర్వ సంపాదకుడు ఏజె థామస్ ఉత్తమ కథల సంకలనం సంపాదకుడుగా వ్యవహరించారు. తెలుగు కవులు చలం, కవన శర్మ, సయ్యద్ సలీం, ప్రసిద్ధ భారతీయ రచయితలు రవీంద్రనాథ్‌టాగూర్, ప్రేమ్‌చంద్, శరత్‌చంద్ర ఛటర్జీ తదితరులు రచించిన కథలున్న ఈ పుస్తకంలో తన కథను ప్రచురించడం సంతోషంగా ఉందన్నారు. రాయలసీమలాంటి కథలకు ఆ పుస్తకంలో స్థానం లభించడం మరచిపోలేని జ్ఞాపకమని ఆయన అభిప్రాయపడ్డారు.

దైన్యం... చివరి మజిలీ మార్గం

అంతిమ కష్టాలు తీరేదెన్నడో ? ● కనీస సదుపాయాలకు నోచుకోని శ్మశాన వాటికలు

అంత్యక్రియలు చేసేందుకు వెళ్లాలన్నా అంతే... ● కర్మకాండలు ఇక ప్రశ్నార్థకమే....



చిట్టడివిని తలపిస్తున్న 29వ వార్డు శ్మశాన వాటిక

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇది చిట్టడవి కాదు... చివరి మజిలీ(శ్మశానం).... అవును జీవితానికి చివరి మజిలీ చేరాలంటే ఎన్నో కష్టనష్టాలు అనుభవిస్తే తప్ప మార్గం సుగమం కాదనేది నగ్న సత్యం. ఇక్కడ చివరి మజిలీలో కనీసం మౌలిక సదుపాయాలు సైతం కరవయ్యాయని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకెళ్లాలన్నా తీరు తెన్నూ లేక ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. దేహం విడిచిన ఆత్మకు శాంతి చేకూరాలంటే మృతదేహానికి శాస్త్రోక్తంగా ఉత్తర క్రియలు చేయాలి. అయితే మృతదేహాన్ని శ్మశానికి తీసుకెళ్లాలన్నా కుటుంబ, బంధు, మిత్రులు సైతం ఎన్నో కష్టాలను అనుభవించాల్సి ఉంటోంది. తర్వాత మూడో రోజు, ద్వాదశ కర్మలకు సైతం వెళ్లాల్సి వస్తోంది. ఇన్ని ఇక్కట్లను అనుభవించలేని కుటుంబ, బంధు, మిత్రులు నామమాత్రంగా కొద్ది మంది మాత్రమే వెళ్లి తంతు ముగించుకుని వస్తుంటారు. ఫలితంగా ఆత్మకు సరైతన శాంతి లభించదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఈ విషయాలను అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదంటే అతిశయోక్తి కాదు. ఇదీ పట్టణంలోని 29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశానవాటిక దీన స్థితి. వివరాల్లోకెళితే....

మున్సిపాలిటీ పరిధిలో 36వార్డుల్లో సుమారు 90 వేల పైచిలుకు జనాభా నివసిస్తుండగా మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం 12శ్మశాన వాటికలున్నాయి. వాటి అభివృద్ధి కోసం ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. కుమ్మరకొట్టాల వెనుకవైపు ఉన్న హిందూ శ్మశాన వాటికకు అంతిమ కష్టాలు తీరడంలేదు. ఏళ్ల తరబడి హిందూ శ్మశానవాటికలు ఎలాంటి అభివృద్ధికి నోచు కోలేదు. పేరుకే 12 శ్మశానవాటికలున్నా వాటి అభివృద్ధి కోసం ఎటువంటి నిధులూ మంజూరు కాకపోవడంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. కొన్నిచోట్ల శ్మశాన వాటికలు కంపచెట్లతో నిండుకుని ఉండగా, మరి కొన్ని శ్మశానాలకు రహదారి సైతం లేదాయె. కొన్ని శ్మశానాలు సైతం కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి చేరాయి. ఇలా ఏ శ్మశానాన్ని చూసినా దయనీయ స్థితిలోనే దర్శనమిస్తున్నాయి. శ్మశానాల అభివృద్ధి కోసం అధికారులు, పాలకులు హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా 29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశాన వాటికలో పరిధిలో 6వేల జనాభా ఉన్నా ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాలు చేద్దామంటే శ్మశానంలో కొలువైన సమస్యలు మరింత వేదనకు గురిచేస్తున్నాయి. శ్మశానమంతా కంపచెట్లతో కూరుకుపోయి, మురుగు నీరంతా శ్మశానంలోకి రావడంతో నడుముల్లోతు నీటిలోనే మృతదేహానికి అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. దీంతో శవం త్వరగా వాసన వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి చుట్టూ కంపచెట్లు అల్లుకుపోవడంతో మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అనేక మార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం. ఎన్నికల సమయంలో రాజకీయ నేతలు ఓట్లకోసం శ్మశానాలను అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడం, గెలిచిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంపచెట్లతో మూసుకుపోయిన శ్మశానవాటిక రహదారి

అధికారులు, పాలకులు స్పందించాలి



29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశాన వాటికలో 6వేల మంది జనాభా నివసిస్తున్నా శ్మశాన వాటికలో వసతులులేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శ్మశాన వాటికలో కంపచెట్లు విపరీతంగా పెరిగి కనీసం నీటి సౌకర్యం కూడా లేకుండా పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అనేకమార్లు అధికారులు, రాజకీయ నేతల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి.

డి. విశ్వనాథనాయుడు, 29వ వార్డు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఎవరైనా మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృతదేహం పూడ్చేందుకు గుంత తీయాలన్నా కంపచెట్లు తొలగించాలి, ఇక్కడకు చేరిన మురుగునీరంతా తొలగించాలి. చేరి ఉండడంతో మృతదేహాన్ని అక్కడే ఖననం చేయాల్సిన దుస్థితి ఉంది. రహదారి అంతా కంపచెట్లతో మూసుకుపోవడంతో చాలా కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కంపచెట్లను తొలగించాలి.

బద్రి, 29వ వార్డు

బ్రహ్మం మృతిపై నిజాన్ని వెల్లడించాలి



మాట్లాడుతున్న వనబాక శివలక్ష్మి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ఇటుకల బట్టీలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వనబాక బ్రహ్మం మృతిపై నిజాలు వెల్లడించాలని మృతుడి సోదరి వనబాక శివలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఇటుకల బట్టీ యజమాని 'మీ అన్న ఉరి వేసుకుని చనిపోయాడని' ఫోన్ ద్వారా సమాచారం అందించాడన్నారు. ఆత్మహత్య చేసుకుంటే సంఘటనా స్థలంలో పోలీసు విచారణ, పంచానామా చేయకుండా మృతదేహాన్ని ఆస్పత్రికి ఎలా తరలించారని ఆమె ప్రశ్నించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని చూడటానికి కూడా కుటుంబీకులను అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడు మృతిపై అనుమానం ఉందని, ఈ సంఘటనపై పోలీసుల తీరు అనుమానాస్పదంగానే ఉందన్నారు. సంఘటన స్థలంలో సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్టులను తారుమారు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో వనబాక సంధ్యావలి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కమలాపురంలో వివాహిత అదృశ్యం



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రాస్‌రోడ్డు నివాసం ఉంటున్న వివాహిత పేర్ల భార్గవి (32) శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ భార్గవి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిందని, ఆటోలో కడప వైపు నకు వెళ్లినట్లు వారు తెలిపారన్నారు. భార్గవి ఇంటి నుంచి బయటికి వెళ్లే సమయంలో బ్లూకలర్ డ్రెస్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100532, 9121100529 నెంబర్లకు తెలియజేయాలని, కేసు నమోదు చేశామన్నారు.

రేపు లాటరీ ద్వారా షాపుల ఎంపిక

కడప క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ జిల్లా గీత కులాల కోసం మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను లాటరీ విధానం ద్వారా నిర్వహించనున్నట్లు కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తెలిపారు. లాటరీ ప్రక్రియను కలెక్టరు అధికారికంగా నిర్వహించనున్నారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణం గా నిర్వహిస్తారన్నారు. పూర్తివివరాలతో సమర్పించిన దరఖాస్తు కాపీలు, నాన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుం చలానా, లావాదేవీ పూర్తయిన నిర్ధారణగా, లాటరీ హాలులో ప్రవేశించేందుకు అవసరమైన పాస్, ఏ3-బీ ఫారం దరఖాస్తుదారుల గుర్తింపు, ఇతర వివరాల పరిశీలన కోసం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, తహసీల్దార్లు జారీ చేసిన అదనపు (సప్లిమెంటరీ) ఉప కులధ్రువీకరణ పత్రం చూపా లన్నారు. అభ్యర్థులు లాటరీ ప్రక్రియకు ఉదయం 8గంటల్లోపు సభాభవన్‌లో హాజరవాలి. అభ్యర్థులు తమ పత్రాలను ముందుగా సిద్ధం చేసుకుని లాటరీ అన్ని నిబంధనలు పాటించాలి. లాటరీ ప్రాసెస్ పూర్తయిన అనంతరం ఎంపికై న అభ్యర్థులకు వెంటనే తగిన మార్గదర్శకాలు ఇవ్వబడతాయి.

లిఫ్ట్ పేరుతో చోరీలు : డీఎస్పీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంలో వెళుతూ బస్సు, ఆటో కోసం ఎదురుచూస్తున్న వారికి లిఫ్ట్ ఇస్తామని చెప్పి దారిలో వారిని కొట్టి డబ్బులు, బంగారు ఎత్తుకెళుతున్నారని డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరిం చారు. శనివారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు నిందితుల అరెస్టును చూపిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వరుస దోపిడీలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ముగ్గురు సభ్యుల అంతర్‌జిల్లా దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పొన్నతోట జయచంద్ర రిమాండ్‌లో ఉండగా ప్రస్తుతం నాగరాజు, వెంకటరమణను అరెస్టు చేశామన్నారు. నాగరాజు ద్విచక్ర వాహనంలో వెళుతూ వాహనాల కోసం ఎదురుచూస్తున్న వారిని లిఫ్ట్ ఇస్తామని చెప్పి దారిలో వారి వద్ద నుంచి డబ్బులు, బంగారు ఎత్తుకెళుతున్నాడన్నారు.

'కృష్ణా' కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ నేత తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రాయలసీమలో ఉన్న శ్రీశైలం జలాశయానికి సమీపంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. మంత్రులకు ర్యాంకింగ్ ఇవ్వడం సెల్ఫ్ గోల్‌తో సమానమన్నారు. ర్యాంకింగ్‌లో ముఖ్యమంత్రికి 6వ ర్యాంకు, లోకేష్‌కు 8, పవన్‌కు 10వ ర్యాంకు ద్వారా ప్రజల్లో, కార్యకర్తల్లో మిగతా మంత్రుల్లో వారిపట్ల చులకన భావం వస్తుందన్నారు.

కొండకు ఆకతాయిల నిప్పు

కాలిపోయిన పాలిషీట్, పీవీసీ పైపులు

లింగాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండకు ఆకతాయిలు శుక్రవారం రాత్రి అగ్గిపెట్టడంతో లింగాల వాసి కుమ్మెత రామాంజనేయరెడ్డి ఫారమ్ పాండ్ పాలీషీట్, 25పీవీసీ పైపులు, 30 స్ప్రింక్లర్స్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. రైతుకు సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. కొండకు దిగువన తోట ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోవాలి.



కాలిపోయిన ఫారమ్ పాండ్ పాలీషీట్

గండి నిత్యాన్నదానానికి లక్ష విరాళం

చక్రాయపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం పాలెంపల్లె భక్తుడు మేకల హనుమంతయ్య, కుమారుడు ఆంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని సమర్పించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వచనాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

గండి వీరాంజనేయస్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రెండో శనివారం, భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లలో రద్దీగా కనిపించారు. భక్తులు పాపాఘ్నిలో స్నానాలాచరించి అంజన్నను దర్శించుకున్నారు. శనివారం రూ.4,62,096 ఆదాయం వచ్చింది.

అసౌకర్యాల నడుమ కేజీబీవీ

●అర్ధాకలి చదువులు ●బాలికలకు అరకొర వైద్యసేవలు● స్కూల్‌లో లేని పిల్లలకూ ఉన్నట్లు హాజరు ●సామాజికతనిఖీ బృందం వెల్లడి



కస్తూర్బా స్కూల్‌లో వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని కస్తూర్బా గురుకుల విద్యాలయం అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. కాగా విద్యాలయంలో రెండురోజుల పాటు సోషియల్ ఆడిట్ జరిగింది. దీని కి సంబంధించిన వివరాలను శనివారం బాలికల తల్లిదండ్రుల సమావే శం నిర్వహించి ఆడిట్‌బృందం సభ్యులు వెల్లడించారు. రెండురోజుల విచా రణలో విద్యార్థినులు బహిర్గతం చేసిన, తాము గమనించిన అం శాల ను ఈ సమావేశంలో వివరించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా లయంలో పిల్లలు లేకపోయినా వచ్చినట్టు హాజరు వేసినట్లు తనిఖీ బృం దం గుర్తించామన్నారు. ఏఎన్ఎం లేకపోవడంతో బాలికల వైద్య సేవలు కరువయ్యాయన్నారు. ఒకే వాచ్‌మెన్ ఉండటంతో రాత్రిళ్లు భద్రతపై అను మానాలున్నాయని బాలికలు పేర్కొన్నట్లు తెలిపారు. వేడినీళ్లు లేవని చన్నీళ్ల స్నానంచేసి అనారోగ్యం పాలవుతున్నట్లు చెప్పారు. మెనూ ప్రకారం భోజ నం తయారు చేయకుండా నీళ్లరసంతో భోజనం పెడుతున్నారని, హాస్టల్, తరగతి గదులలో ఫ్యాన్లు సరిగా పనిచేయడం లేదని, శానిటరీ న్యాప్‌కిన్ లను బర్నింగ్‌మిషన్ లేక వాటిని బయట డంప్‌చేశారని వారు పేర్కొన్నా రు. విద్యార్థినుల ట్యాబ్‌లను సిబ్బంది తీసుకున్నారని, విద్యాలయం లోనికి పిల్లల రాకపోకలు, ఇతరులు వచ్చి వెళ్లే వివరాలను సరిగా రిజిస్టర్‌లో నమోదు చేయడం లేదని వివరించారు. ఆడిట్ బృందం 175 ప్రశ్నలతో కూడిన విచారణను చేసిందన్నారు. విద్యార్థినులకు సిబ్బందితో ఎటువంటి సమస్యలు ఎదురైనా 14417 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని వారు తల్లిదండ్రులను కోరారు. కాగా విద్యాలయంలో 250మంది పైగా విద్యార్థిను లుండగా 30మంది విద్యార్థినుల తల్లిదండ్రులు మాత్రమే హాజరు కావడం కొసమెరుపు. ఈ విషయమై ఎస్వో విశ్వలత సమావేశంలో వివరణ ఇస్తూ ఏఎన్ఎం, వాచ్‌మెన్, ఫ్యాన్లు, హాట్‌వాటర్ తదితర సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాల్సిఉందన్నారు. మిగతా అంశాలను చక్కదిద్దుతామన్నారు. కార్య క్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ విశ్వలత, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు రూప, వెంకటసుబ్బయ్య, కేజీబీవీ సిబ్బంది, సోషి యల్ ఆడిట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారులు యూసఫ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



యూసఫ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎంతో పట్టుదలతో కష్టపడి జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారుడు .యూసఫ్‌ను ఔత్సాహిక యువ క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. మదనపల్లెకు చెందిన యువ క్రీడాకారుడు యూసఫ్ గత జనవరిలో నేపాల్‌లో జరిగిన షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో భారత్ తరపున ఆడుతూ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా శనివారం కలికిరిలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. యూసఫ్ విజయం జిల్లాకు గర్వకారణమని కిశోర్‌కుమార్ రెడ్డి ప్రశంసించారు. యువ క్రీడాకారుడైన యూసఫ్‌కు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యూసఫ్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిరంజన్‌రెడ్డి, సయ్యద్ బాషా, కోసూరి చంద్ర, రామమూర్తితోపాటు పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల వద్ద వైద్య సిబ్బందిని నియమించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో ఆశాలను కాకుండా వైద్య సిబ్బందిని నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు శనివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని కోరారు. వైద్యం పట్ల అవగాహన లేని వారిని పరీక్ష కేంద్రాల్లో మెడికల్ క్యాంపుల్లోడ్యూటీలు వేయడం, విద్యార్థులకు ఏదైనా జరిగితే అందుకు వైద్యాధికారులే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యం

పీలేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సంక్షేమమే తమ లక్ష్యమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. పీలేరులో శనివారం జరిగిన పీలేరు మండల ఎస్టీయూ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దు చేయాలని, 2017, 2023 సంవత్సరాల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యే అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు 'టీఐఎస్'ను జాగ్రత్తగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ రెడ్డి, పీలేరు డివిజన్ ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నాటుసారా అక్రమరవాణాచేస్తున్న ఒకరిని మదనపల్లె ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపారు. శనివారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో మదనపల్లె మండలం చంద్రమాకుల పల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నల్లగుట్టపల్లె తాండాకు చెందిన బి.రమేష్‌నాయక్(30) ద్విచక్రవాహనంలో 40 లీటర్ల నాటుసారా తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. అదే విధంగా సురేంద్ర నాయక్ పోలీసులను చూసి వాహనాన్ని వదిలి పారిపోగా వాహనంతో పాటు 40 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన సురేంద్రనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, సిబ్బంది వీరనారయ్య, దామోదర్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోండి

●ఉన్నతాధికారులకు డాక్యుమెంట్ రైటర్ల ఫిర్యాదు

మదనపల్లె, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సబ్‌రిజిస్ట్రార్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని డాక్యుమెంట్ రైటర్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు వ్యక్తి నరసింహులును నియమించుకుని అటు రైటర్లను, ఇటు ప్రజలను కార్యాలయంలో గంటల తరబడి నిలబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని సబ్‌కలెక్టర్‌తోపాటు ఆశాఖ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ హోదాలో డిప్యూటేషన్‌పై సబ్‌రిజిస్ట్రార్‌గా వచ్చిన గురుస్వామి ప్రభుత్వ విధి విధానాలను పాటించలేదని తెలిపారు. ఇక్కడి కార్యాలయంలో రెండోసబ్‌రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న ప్రైవేటు వ్యక్తిని తొలగించడంతోపాటు రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌ను నియమించి తమకు న్యాయం చేయాలని సీనియర్ డాక్యుమెంట్ రైటర్ రంగు రాజేంద్ర, దస్తావేజు లేఖరులు ఎం.సుబ్రహ్మణ్యంనాయుడు, గణేష్‌స్వామి, గజేంద్ర, కె.వెంకటేష్, యు.ప్రసాద్, ఎ.హరిబాబునాయుడు, వై.శ్రీనివాసులునాయుడు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

తంబళ్లపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు భేష్

● నాయకులతో సమావేశమైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌తో సమావేశమైన టీడీపీ నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాగా చేపట్టి విజయవంతం చేశారని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో శనివారం తంబళ్లపల్లె నియోజకర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాయకులతో సమావేశమై సభ్యత్వ నమోదు, త్వరలో వేయనున్న కమిటీల గురించి చర్చించారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు కట్టా సురేంద్రనాయుడు, మూగి రవిచంద్ర, చాంద్‌బా షా, భజంత్రి రామాంజులు, సంపతికోట కిట్టన్న, చంద్రమోహన్‌రెడ్డి, దేరం గుల నారాయణ, మోహన, ఆనందరెడ్డి, మొటుకు శివ, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు

కురబలకోట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగవకాశాలను సాధించవచ్చని రీసోర్సుపర్సన్ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యా ర్థులు తమలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి రాజశేఖరన్, కో ఆర్డినేటర్ చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రామసముద్రం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కర్నాల వీధికి చెందిన వేణు(25)అనే యువకుడు ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం ఏలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేణు తీవ్రంగా గాయపడగా ఏలూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఢిల్లీలో విజయంపై బీజేపీ సంబరాలు

పీలేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో శనివారం పీలేరులోని ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చి ప్రజలకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర రెడ్డి, వెంకటరమణ, సుదర్శన్ రెడ్డి, సుధారాణి, పీఎం ఖాన్, మిలటరీ నారాయణస్వామి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో:దేశ రాజధానికి ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో భారీ ఎత్తున బాణా సంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, నాయకులు నగేష్, రమేష్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేమనారాయణ, ఫరీద్‌బాబు, సదాశివ, రామ్మోహన్, శంకరప్ప, ద్వారకనాథ్, మునేంద్ర, ప్రవీణ్‌కుమార్, గిరి, గణేష్ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: దేశరాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో 27 ఏళ్ల తర్వాత బీజేపీ ఘనవిజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బి.కొత్తకోట జ్యోతిసర్కిల్ లో టపాసులు పేల్చి, కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. మోదీ నాయకత్వాన్ని యావత్ దేశం కోరుకుంటోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముకుంద, రమేష్, మనోహర్, రంగారెడ్డి, యండీమస్తాన్, శోభ, రవి, సిద్దారెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ఢిల్లీలో బీజేపీ విజయ కేతనం ఎగురవేయడంతో మండల కూటమి నాయకులు శనివారం విజయోత్సవాలు జరుపుకున్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విజయోత్సవం సంబరాలు జరిగాయి. బాణసంచాలు పేల్చారు. స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో కూటమి నేతలు బండ్రేవు శివారెడ్డి, గంగాధర, చిలిపి మహ బూబ్‌బాషా, నిమ్మ నాగేశ్వర, ప్రభాకరరెడ్డి, చిన్నోడు, చంద్రా, మల్లికార్జున నాయక్, ప్రకాష్‌రెడ్డి, తిమ్మయ్య రాజు, మహేశ్వర నాయకులు పాల్గొన్నారు.

కలికిరిలో: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం స్వంత చేసుకోవడంతో ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. గాంధీ కూడలి వద్ద స్వీట్లు పంచిపెట్టారు. ఒకరికొకరు అభినందించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి నరేంద్రరెడ్డి, కుమార్‌రెడ్డి, మాజీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప, చింతపర్తి మహేష్, రాజా రెడ్డి, మదనమోహన్ రెడ్డి, నరేష్, గణేష్, విశ్వనాథ ప్రతాపరాజు, సుధాకర్ గౌడ్, బండి మురళి, బండి కృష్ణ పాల్గొన్నారు.

కలికిరిలో పూర్వ విద్యార్థుల సమావేశం



గురువులతో కలికిరి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కలికిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో 1971-72 సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో శనివారం సమావేశమయ్యారు. అప్పట్లో డ్రాయింగ్ మాస్టరుగా పని చేసిన వేంపల్లె అబ్దుల్ ఖాదర్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన పలువురు పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన అప్పటి గురువులు ఎన్.సుబ్బరాజ శెట్టి, ఎం.పంచరత్నమ్మ, జె.రుద్రయ్య, నారాయణ రెడ్డిలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో కంప్యూటర్ పరికరాల ఏర్పాటుకు రూ.71,116లు పూర్వ విద్యార్థులు అందజేశారు. . కార్యక్రమంలో హెచ్ఎం శారదతోపాటు నిర్వాహకులు సురేంద్ర రెడ్డి, బీవీ రెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ మదనపల్లె నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ వెంటనే కార్మిక చట్టాలను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటికి వ్యతిరేకంగా ఈ నెల 16, 17న రైల్వేకోడూర్‌లో నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా మహాసభల్లో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, దేవా, నాయకులు ముబారక్, తిరుమల, భవన నిర్మాణ కార్మిక నేతలు మురళి, హరి, వాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజ, ఇంద్రాణి, పృథ్వీ, వాసు వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంజేఆర్‌లో స్పోర్ట్స్ మీట్, ఫ్రెషర్స్ డే



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రచ్చ రవి

పీలేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్, ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎంవీ అవినాశ్‌రెడ్డి మట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు గత రెండు రోజులుగా తమ కళాశాలలో క్రికె ట్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, త్రోబాల్ పోటీలు నిర్వహించామన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. క్రీడలు, సాంస్కృతిక నైపుణ్యాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రముఖ సినీ, టీవీ నటుడు రచ్చ రవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుకు వినతిపత్రాల వెల్లువ

పీలేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పీలేరు పర్యటనకు వచ్చిన మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌కు వినతి పత్రాలు వెల్లువెత్తాయి. కొంత మంది వ్యక్తిగత సమస్యలు విన్నవించుకోగా కొంత మంది సామాజిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పీలేరులోని శ్రీనాథపురం కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులు కావాలని ఆ పాఠశాల హెచ్ఎం రహత్ బాషా, ఉపాధ్యాయుడు మహమ్మద్ అలీ వినతిపత్రం అందజేశారు. పీలేరులో ఉర్దూ అకాడమీ ద్వారా ముస్లిం విద్యార్థులకు ఉర్దూ మీడియంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ మైనారిటీ నాయకులు మహబూబ్ బాషా, ఖాజా, జహీర్ వినతి పత్రం అందజేశారు. ముస్లిం సామాజికవర్గంలోని పఠాన్‌లను బీసీలలో చేర్చాలని పీలేరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు పఠాన్ జాకీర్ హుస్సేన్ అభ్యర్థించారు. రిజర్వేషన్లు లేక రాష్ట్రంలోని పఠాన్‌లు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆయన తెలిపారు. తెలంగాణలో పఠాన్‌లు బీసీలుగా ఉన్నారని, ఏపీలోనూ ఆ రిజర్వేషన్ వర్తింపజేయాలని ఆయన షరీఫ్‌ను కోరారు. పోలీసులు తమ కుమార్తె విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలికిరి మండలం గడి గ్రామానికి చెందిన సుమయ్య అనే మహిళ ఆయనకు ఫిర్యాదు చేసింది.

నగరిపల్లెలో ప్రభుత్వ మైనారిటీ విభాగం సలహాదారు షరీఫ్

కలికిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షరీఫ్ శనివారం నగరిపల్లెలోని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి నివాసంలో పలువురు మైనారిటీ నేతలను కలిసి మాట్లాడారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటనలు ముగించుకుని శుక్రవారం రాత్రి ఆయన స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో బసచేశారు. అనంతరం శనివారం ఉదయం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామమైన నగరిపల్లెకు చేరుకున్నారు. షరీఫ్‌ను ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. అక్కడ కిశోర్‌కుమార్ రెడ్డితో మైనారిటీ సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చలు జరిపారు. తన సోదరుడు సీఎంగా వున్న కాలంలో పీలేరు నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీల షాదీఖానాలు, స్మశాన వాటికల అభివృద్ధి కోసం రూ.వందల కోట్లు వెచ్చించిన విషయాలను వివరించారు. అటు నుంచి ఆయన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డితో కలిసి పీలేరులో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సూర్య..చంద్ర వాహనాలపై వెంకన్న చిద్విలాసం



తంబళ్లపల్లె, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగి వెంకన్న చిద్విలాసంతో దర్శనమిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజైన శనివారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామునే టీటీడీ వేదపండితులు స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం స్వామి వారు సూర్యనారాయణుడు అలంకరణలో సూర్యప్రభ వాహనంపై కొలువు దీరి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారికి ఆలయ మండపంలో కనులపండువగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి వారు వెన్న కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై కొలువు దీరి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భజన బృందాల కోలాటలు, అన్నమయ్య కీర్తనలు, భక్తుల గోవింద నామస్మరణలతో వాహన సేవ వేడుకగా సాగింది. వాహన సేవల్లో ఇన్‌చార్జి ఆలయ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి, టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, ఆదిరెడ్డి, ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టర్, రమేష్ స్వామి, ఆలయ సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాసుడి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీవారి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరుగనుంది. స్వామి వారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం శ్రీవారికి సర్వభూపాల వాహన సేవ, రాత్రి 8 గంటల నుంచి ఆలయ వాహన మండపంలో అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం అనంతరం 10 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణుడు గరుడవాహనంపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో ఊరేగనున్నారు.

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ప్రత్యేక పూజలు

● శాంతి హోమంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్



శాంతిహోమంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం సాంప్రదాయ దుస్తుల్లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో అర్చకులు శాంతిహోమం నిర్వహించారు. గత ఏడాది జూలై 21వ తేదీన మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో అగ్నికి పలు కీలక ఫైళ్లు దహనమై, ఫర్నీచర్ ఆస్తినష్టం జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సబ్‌కలెక్టరేట్ కార్యకలాపాలు, పాలన అంతా హెచ్ఎన్ఎస్ కార్యాలయం నుంచే జరుగుతోంది. ఈ క్రమంలో రెండు నెలలుగా సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన వస్తువులను తొలగించి, నూతన ఫర్నీచర్ ఏర్పాటు, కోర్టు హాలు, సబ్‌కలెక్టర్ చాంబర్, ఏవో చాంబర్‌తో పాటు కొత్తగా రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఎక్కడ కూడా రాజీ పడకుండా అన్ని విభాగాలను మరమ్మతులు చేయించి సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో సబ్‌కలెక్టరేట్‌లో శాంతిహోమం నిర్వహించారు. ఈనెల 15 తర్వాత సబ్‌కలెక్టరేట్ పునః ప్రారంభించనున్నట్లు తెలిసింది.

వాల్మీకిపురంలో 12న కోటి దీపోత్సవ వేడుకలు

●ముస్తాబవుతున్న గరుడ పుష్కరిణి ●ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు



కోటిదీపోత్సవ వేడుకలకు సిద్ధమైన గరుడ పుష్కరిణి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి ఆల యంలో ఈనెల 12న (బుధవారం)మాఘ పౌర్ణమి సందర్భంగా కోటి దీపోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఉదయం లక్ష్మీకామేశ్వరస్వామికి పంచామృత, ఏకాదశ రుద్రాభిషేకములు, శాంతి హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గోనవరపు శీనాస్వామి పేర్కొన్నారు. సాయంత్రం 5గంటల నుంచి కోటి దీపోత్సవ పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ మహాకోటి దీపోత్సవ వేడుకల సందర్భంగా ఆలయం సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. వేడుకలకు వేదికగా ఆలయంలోని గరుణ పుష్కరిణిని సిద్ధం చేసి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా హజరత్ మస్తాన్‌వలి ఉరుసు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వాల్మీకిపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని హసన్‌ఖాన్ వీధిలో వెలసిన హజరత్ ఖ్వాజాపీర్ మస్తాన్‌వలి దర్గా ఉరుసు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలి కచేరిలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం దర్గాలో మదనపల్లె ఎమ్మె ల్యే షాజహాన్‌బాషా చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. ఉరుసు ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాలలో దర్గా కమిటీ అధ్యక్షుడు సందాని బాషా, మతపెద్దలు ఖాజాపీర్, సభ్యులు సయ్యద్‌బాషా, కలందర్, యూసుఫ్, మహ్మద్‌ఆలీ, డిష్ బ్రదర్స్, చాను, సాదిక్, జంషీద్, రియాజ్, స్థానిక యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో ఈనెల 10న (సోమవారం) ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు నక్షత్రమున సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజులు పేర్కొన్నారు. ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



స్థానిక పీటీఎం శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలో స్వామి వారికి ఉదయం పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు రాగా తీర్థప్రసాదాలతో పాటుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.కొత్తకోటకు చెందిన ఆకుల మల్లికార్జునతో పాటుగా శివాలయ సేవకులు పాల్గొన్నారు.

నేడు అంగళ్ళులో ఉరుసు

కురబలకోట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంగళ్ళులో రెండు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఆదివారం గంధోత్సవం, సోమవారం ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు గడువు పొడిగింపు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల ద్వారా అందిస్తున్న రుణాల దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు మరింత గడువు ఇవ్వాలన్న అభ్యర్థన మేరకు కూటమి ప్రభుత్వం గడువును ప్రభుత్వం పెంచిందన్నారు. ఆ గడువు లోగా అర్హులైన లబ్ధిదారులు రుణాల కోసం ధరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని ఎంపీడీవో కోరారు.